
JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి I శనివారం 24-01-2026
Medchal - Malkajgiri I Saturday 24-01-2026
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
Follow: jayabherinews
సంపుటి : 02 I సంచిక : 238
పేజీలు : 8 I వెల : 5
Vol. 02 I Issue 238 I Pages : 8 I ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com


# మేడారం జాతరకు ప్రధాని మోదీ గిఫ్ట్




- నిధులు మంజూరు చేసిన కేంద్రం
- రెండు శాఖలు సంయుక్తంగా రూ. 3.70 కోట్లు నిధులు విడుదల

జయభేరి, న్యూఢిల్లీ:

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగ అయిన మేడారం జాతర అంగరంగా వైభవంగా జరుగుతోంది. లక్షలాదిగా భక్తులు గిరిజన దేవతలను దర్శించుకోవడానికి తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో మేడారం మహా జాతర కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ, గిరిజన వ్యవహారాల శాఖలు సంయుక్తంగా రూ. 3.70 కోట్లు నిధులు విడుదల చేశాయి. కాగా, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి.. ఈ నిధులు మంజూరు అయ్యేలా చొరవ తీసుకున్నారు. కాగా, మేడారం మహా జాతరకు భారీ సంఖ్యలో భక్తులు వస్తున్నందున.. మెరుగైన సదుపాయాలు కల్పించడానికి నిధులను విడుదల చేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇదే కాకుండా గతంలో కూడా కేంద్ర పర్యాటక శాఖ నిధులు మంజూరు చేసింది. మేడారంతో పాటు దాని చుట్టుపక్కల ఉన్న ములుగు, లక్నవరం, తాడ్వాయి, దామరవాయి, మల్లూరు, బొగత జలపాతం వంటి ప్రాంతాల్లో పర్యాటకాన్ని ప్రోత్సహించానికి రూ. 80 కోట్లు ఇచ్చింది. గిరిజన సర్క్యూట్ పేరిట పర్యాటకులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడానికి, పలు అభివృద్ధి

...మిగతాది 2 లో

# గూగుల్ అదిరే ఆఫర్



- ఉచితంగా 3 వేలకు పైగా AI, టెక్ కోర్సులు!
- ఈ కోర్సులు ఎందుకు నేర్చుకోవాలి?

జయభేరి, న్యూఢిల్లీ:

ప్రస్తుతం ఎక్కడ చూసినా ఆర్టిఫీషియల్ ఇంటెలీజెన్స్ (ఏఐ) టెక్నాలజీ హవా నడుస్తుంది. ఏఐ స్కిల్స్ ఉన్న వారికే జాబ్ మార్కెట్లో ఆకర్షణీయమైన జీతంతో ఉద్యోగ అవకాశాలు దక్కుతున్నాయి. బ్యాంకింగ్, ఫైనాన్స్, సాఫ్ట్‌వేర్, మీడియా సహా ఏ రంగం చూసినా ఏఐ వాడేస్తున్నారు. ఈ క్రమంలో భారతీయ విద్యార్థుల కోసం గూగుల్ ఏకంగా 3 వేలకుపైగా ఏఐ, టెక్ కోర్సులను ఉచితంగా అందిస్తుంది. ఈ ఏడాది గూగుల్ అందించిన అతిపెద్ద AI అవకాశాలలో ఇది ఒకటి. చాలా మంది ఇప్పటికే ఏఐ కోర్సుల్లో చేరి నైపుణ్యాలను ఒరిసి పట్టుకుంటున్నారు. గూగుల్ ఆఫర్ చేస్తున్న ఈ కోర్సులు ఎందుకూ పనికిరాని సర్టిఫికెట్ కోర్సులుగా భావిస్తే తప్పులో కాలేసినట్లే. ఎందుకంటే ఇది కేవలం యాదృచ్ఛిక అభ్యాస పోర్టల్ కాదు. నిజానికి AI, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి పలు సాంకేతికతలను రూపొందించిన Google బృందాలచే రూపొందించబడిన కోర్సులు ఇవి....

...మిగతాది 2 లో



# కేటీఆర్ ను విచారిస్తున్న సీపీ, ఏసీపీ

- సీపీ విజయ్ కుమార్, ఏసీపీ వెంకటగిరి ఆయన్ని ప్రశ్నిస్తున్నట్టు తెలుస్తోంది
- రాధాకిషన్ రావుతో కలిసి విచారణ
- సిరిసిల్ల కేంద్రంగా వ్యవహారం - బండి

జయభేరి, హైదరాబాద్, జనవరి 23 :

తెలంగణలో రాజకీయ రణరంగానికి కారణమైన ఫోన్ ట్యాపింగ్ కేసు కీలక మలుపు తిరిగింది. ఈ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సిట్ అధికారులు విచారిస్తున్నారు. బుధవారం హరీష్‌రావును విచారించిన సిట్ గురువారం కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసింది. శుక్రవారం ఉదయం 11 గంటలకు విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. అధికారుల ఆదేశాల మేరకు ఈ ఉదయం జూబ్లీహిల్స్‌లోని సిట్ కార్యాలయానికి కేటీఆర్ హాజరయ్యారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌ను సిట్ బృందం వివిధ అంశాలపై ప్రశ్నలు వేస్తోంది. ఇప్పటి వరకు సేకరించిన సమాచారం ఆధారంగా ఆయన్ని క్వశ్చన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ కేసులో ఇది వరకే అధికారులు, ప్రజా ప్రతినిధులను సిట్ బృందం ప్రశ్నించింది. వారి నుంచి వాంగ్మూలాలను సేకరించింది. వాటి ఆధారంగానే కేటీఆర్‌ను ప్రశ్నిస్తున్నట్టు సమాచారం. ఈ విచారణలో ఇద్దరు అధికారులు కీలక పాత్ర పోషిస్తున్నారు. సీపీ విజయ్ కుమార్, ఏసీపీ వెంకటగిరి ఆయన్ని ప్రశ్నిస్తున్నట్టు తెలుస్తోంది.

...మిగతాది 2 లో




# నేను ఏ తప్పు చేయలేదు

## కుండబద్దలు కొట్టిన కేటీఆర్

హైదరాబాద్, జనవరి 23

తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాసేపట్లో విచారణకు హాజరుకానున్నారు. అంతకు ముందు ఆయన తెలంగాణ భవన్‌కు వచ్చారు. అక్కడ పార్టీ నేతలతో సమావేశమయ్యారు. ఆయన విచారణకు వెళ్తున్న సందర్భంగా మహిళా నేతలంతా తిలకం దిద్ది పంపించారు. సీనియర్ నేతలతో సమావేశమైన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. జరుగుతన్న విచారణ కేవలం టైంపాస్ కోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు అయినప్పటి నుంచి అనుక్షణం ప్రజల కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం శ్రమించామని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు తాము ఎప్పుడు వేధింపులకు పాల్పడలేదని అన్నారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేన్నరేళ్లలో ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు.

2 లో



# ఆధార్ కార్డు ఉంటేనే ప్రసూతి చేస్తాం

- ఆధార్ లేదు.. అమ్మను కాలేనా..?.. అంటూ.. మనోవేధనకు గురవుతున్న గర్భిణి
- పొట్టకూటి కోసం ఇతర రాష్ట్రాలు తిరిగే కుటుంబాల పరిస్థితి అగమ్య గోచరం

జయభేరి, కరీంనగర్, జనవరి 23 :

పొట్టకూటి కోసం ఇతర రాష్ట్రాలు తిరిగే కుటుంబాలు తిమ్మాపూర్ మండలంలోని రామకృష్ణ కాలనీ గ్రామంలో ఎన్నో ఉన్నాయి. వారు వారి కుటుంబాలతో ఇతర రాష్ట్రాలకు వెళ్లిన సమయంలో పిల్లలు పుడితే, వారి పేరు నమోదు జాప్యం కావడంతో ఆధార్ లేక పిల్లలు పెద్దయ్యాక సతమతమవుతున్నారు. ప్రస్తుతం బేడ బుడగ జంగం సామాజిక వర్గానికి చెందిన 23 ఏండ్ల ఊబిది రేఖ గర్భవతి. వారి కుటుంబం ఆమె చిన్ననాటి నుంచే ఇతర రాష్ట్రాలలో చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నది.ఈ క్రమంలో ఆమె పుట్టిన సమయంలో అధికారికంగా పేరు ఎక్కడా నమోదు కాలేదు. దీంతో ఆమె ఆధార్ కార్డు తీసుకోవడంలో జాప్యం జరిగింది. అయితే ఆమె గర్భం ధరించిన నుండి ఆసుపత్రిలో చికిత్స కోసం వెళితే ఆధార్ కార్డు లేక ఇబ్బందులు పడుతోంది. ప్రస్తుతం నిండు గర్భిణీ కావడంతో కరీంనగర్ మాతా శిశు ఆసుపత్రిలో ఆధార్ కార్డు ఉంటేనే ప్రసూతి చేస్తామని డాక్టర్లు చెబుతున్నారని, తనకు ఆధార్ కార్డు లేదని ఆమె వాపోతోంది. ప్రైవేట్ దవాఖానకు వెళ్లి డెలివరీ చేయించుకునే ఆర్థిక స్థోమత తమకు లేదని, అధికారులు తనపై కనికరం చూపించి ఆధార్ కార్డు ఇప్పించి, తనకు గుర్తింపునివ్వాలని కోరుతోంది. తనకు ఆధార్ కార్డు లేకపోతే అమ్మను కాలేనా..? అని వాపోతోంది.



# సప్త సముద్రాల అవతల దాక్కున్నా వదలం

- ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సిట్ విచారణ
- పోలీసుల అత్యుత్సాహంపై పోలీసు అధికారులకు హరీశ్‌రావు వార్నింగ్

జయభేరి, హైదరాబాద్, జనవరి 23 :

ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సిట్ విచారణకు హాజరైన క్రమంలో పోలీసుల అత్యుత్సాహంపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కుట్రపూరితంగా, ఉద్దేశపూర్వకంగా తమపై కేసులు పెట్టారని తెలిపారు. ఈ కేసులో కేటీఆర్ విచారణకు హాజరయ్యారని.. రేవంత్ రెడ్డిని కూడా ఫోన్ ట్యాపింగ్‌పై విచారించాలని డిమాండ్ చేశారు.జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లకుండా బీఆర్ఎస్ నాయకులపై పోలీసుల దౌర్జన్యాన్ని నిరసిస్తూ మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు శంకర్ నాయక్, క్రాంతి నాయక్, ఇతర బీఆర్ఎస్ నాయకులు జూబ్లీహిల్స్‌లోని రోడ్డుపై

...మిగతాది 2 లో



# విశిష్ట గోల్డ్ స్టోర్ ను ప్రారంభించిన నటి ఐశ్వర్య రాజేష్

జయభేరి, హైదరాబాద్ :

వైవిద్య భరతమైన బంగారు వజ్రభరణాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని సినీనటి ఐశ్వర్య రాజేష్ అన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ లో నూతనంగా ఏర్పాటుచేసినవిశిష్ట గోల్డ్ అండ్ డైమండ్స్ స్టోర్ ను ప్రారంభించారు. విశిష్ట షో రూమ్ లో గోల్డ్ అండ్ డైమండ్ ఆభరణాలు ఎంతో అద్భుతంగా డిజైన్ చేశారన్నారు. ఇక లైట్ వెయిట్ డైమండ్ జ్యూవెలరీ అంటే ఎంతో ఇష్టపడతానన్నారు. ఇక విశిష్టలో విభిన్నంగా, సంప్రదాయ శైలిని ఆధునికతతో సమ్మిళితంగా చేసిన డిజైన్లు తనను ఎంతో ఆకట్టుకున్నాయన్నారు. షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా గోల్డ్ పోల్కి జువెలరీపై నో వేస్టేజ్ మెకింగ్, లక్ష రూపాయల కొనగోలు పై సిల్వర్, గోల్డ్ కాయిన్స్ అందిస్తున్నట్లు విశిష్ట సీఈవో సిందుజా, ఎండి ఆనంద్ తెలిపారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## నేను ఏ తప్పు చేయలేదు

వచ్చిన మొదటి రోజు నుంచి వివిధ కుంభకోణాలు అంటూ ప్రచారం చేశారని అన్నారు. ఇవన్నీ ఒక ఎత్తైతే తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేందుకు రకరకాలుగా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. "నా అంతరాత్మ సాక్షిగా నేను పుట్టిన నేల సాక్షిగా నేను తప్పు చేయలేదని ధైర్యంగా చెప్తున్నా... రెండేళ్లుగా నా మీద తీవ్రమైన క్యారెక్టర్ అసాసినేషన్ చేస్తున్నా, ఎన్ని ఇబ్బందులు పెట్టినా, ఎవరికీ భయపడకుండా ఈ ప్రభుత్వం పై పోరాటం చేస్తున్న." అని అన్నారు. డ్రగ్స్ తీసుకుంటానని, హీరోయిన్లతో సంబంధాలు ఉన్నాయని కూడా దుష్ప్రచారం చేశారని కేటీఆర్ అన్నారు. వీటికి ఎవరు బాధ్యత తీసుకుంటారని ప్రశ్నించారు. ఇప్పుడు రాష్ట్రంలో ఎవరి ఫోన్‌లు ట్యాప్ కావడం లేదని ఎవరైనా అధికారుల చెప్పగలరా అని సవాల్ చేశారు. అసాంఘిక శక్తులను కట్టడి చేయడానికి కచ్చితంగా పోలీసులు ఫోన్లు ట్యాప్ చేస్తారని అన్నారు. గతంలో తమ ఎమ్మెల్యేలను కొని ప్రభుత్వానికి కూల్చేందుకు డబ్బులతో తిరిగిన వ్యక్తి ఇప్పుడు సీఎంగా ఉన్నారని అన్నారు. తన లాగే అందరూ ఉంటారనే ఇలా బురద జల్లుతున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి బావమరిది సృజన్ రెడ్డి కోల్ టెండర్లు కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేశారని దాన్ని బయటపెట్టినందుకే ముందుగా హరీష్‌రావు పై కక్ష కట్టారని కేటీఆర్ అన్నారు. అందుకే మొదట ఆయనకు నోటీసులు ఇచ్చి పిలిచారని ఇప్పుడు తన వంతు వచ్చిందని చెప్పుకొచ్చారు. అక్రమ, అనైతిక పనులు ఎప్పుడూ చేయలేదని అన్నారు. ఇప్పుడు జరుగుతున్నదంతా డైవర్షన్ కోసమే జరుగుతుందని అన్నారు. మొత్తం కేబినెట్ దండుపాళ్యం మాదిరిగా రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని అన్నారు. ఈ కేసును ఎవరు వదిలి పెట్టినా తాను మాత్రం విడిచిపెట్టబోనని కేటీఆర్ స్పష్టం చేశారు. తన క్యారెక్టర్‌ను దెబ్బ తీసేలా చేసిన రేవంత్ రెడ్డిని, కొందరు పోలీసు అధికారులను దోషులుగా నిలబెడతానని అన్నారు. ఎవరు ఎన్ని కక్ష సాధింపులకు దిగినా తమ పోరాటం ఆగబోదని చెప్పారు. కచ్చితంగా కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసే వరకు విశ్రమించబోమని తేల్చి చెప్పారు. సిట్ కార్యాలయంలో పరిసర ప్రాంతాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ విద్యార్థి విభాగం నేతలను అదుపులోకి తీసుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో బిఆర్ ఎస్ వి నేతలను అర్ధరాత్రి నుంచే అరెస్టు చేశారు. నగరంలోని అనేక ప్రాంతాల్లో పార్టీ నేతలను ఇంటి నుంచి రాకుండా కట్టడి చేశారు.

## సప్త సముద్రాల అవతల దాక్కున్నా వదలం

బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోలీసుల వైఖరిని హరీశ్‌రావు నిలదీశారు. కుట్రపూరితంగా వ్యవహరిస్తున్న పోలీసులకు వార్నింగ్ ఇచ్చారు. కావాలనే రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్న అధికారులను సిట్ (SIT) లో పెట్టి మా మీద ప్రయోగాలు చేస్తున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. అధికారులు అన్యాయంగా, అక్రమంగా వ్యవహరిస్తే, ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టాలని ప్రయత్నం చేస్తే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని అన్నారు. చట్టాన్ని అతిక్రమించినా, న్యాయబద్ధంగా వ్యవహరించకపోయినా, తప్పుడు లీకులు ఇచ్చినా ఆ పోలీసులను వదిలిపెట్టేది లేదని పేర్కొన్నారు. అంతకు అంత అనుభవిస్తారు.. జాగ్రత్తగా ఆలోచించుకోవాలని సూచించారు. రిటైర్ అయినా మిమ్మల్ని వదిలిపెట్టమని.. ఏ పొక్కలో దాక్కున్నా, సప్త సముద్రాల అవతల ఉన్నా పట్టుకొచ్చి విచారిస్తామని హెచ్చరించారు. రేపు అధికారంలోకి వచ్చే బీఆర్‌ఎస్ ప్రభుత్వం కూడా మీకు సహకరించదని అన్నారు. మీ సొంత డబ్బులతో, సొంత లాయర్లను పెట్టుకొని కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. అందుకే చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. దావోస్ నుంచి రేవంత్ రెడ్డి ఇచ్చే డైరెక్షన్‌లో కాదు, చట్ట ప్రకారం వ్యవహరించాలని పోలీసులకు హరీశ్‌రావు హితవు పలికారు. తప్పుడు సూచనలు, తప్పుడు ఆదేశాలను పాటించి చట్టాన్ని అతిక్రమిస్తే దానికి మీరే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వం బీఆర్‌ఎస్ నేతలపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం దుర్మార్గమని విమర్శించారు. కుట్రలతో బీఆర్‌ఎస్ నాయకులను బెదిరించాలని చూస్తున్న రేవంత్ పన్నాగం ఇది అని వ్యాఖ్యానించారు. మేం తప్పు చేయలేదు, ఎవరికీ భయపడేది లేదని అందుకే కేటీఆర్ ధైర్యంగా వెళ్లారని స్పష్టం చేశారు. అనేక సందర్భాల్లో బీఆర్‌ఎస్ నాయకులపై దుష్ప్రచారం జరిగింది.. ఆ రోజు ఎందుకు కేసులు పెట్టలేదని ప్రశ్నించారు. మహిళల ఆత్మాభిమానం దెబ్బతీస్తే, కేటీఆర్ మీద సోషల్ మీడియాలో, టీవీల్లో, పత్రికల్లో వార్తలు రాయిస్తే ఏం చేశారని నిలదీశారు. రేవంత్ రెడ్డి మీద కూడా అధికారులు విచారణ జరిపించాలని.. అన్ని విషయాలు బయటకు రావాలని డిమాండ్ చేశారు.

## గూగుల్ అదిరే ఆఫర్

ప్రముఖ దిగ్గజ టెక్ కంపెనీలైన డెలాయిట్, యాక్సెంచర్‌తో సహా 150కి పైగా కంపెనీలు గుర్తించే నిజమైన సర్టిఫికేషన్‌లు ఇవి. ఈ ప్రోగ్రామ్‌లను పూర్తి చేసిన అభ్యర్థులను మాత్రమే ఈ కంపెనీలు నియమించుకుంటున్నాయి. బిగినర్స్ సర్టిఫికేట్‌లు నైపుణ్యం బ్యాడ్జ్‌లు Google క్లౌడ్ సర్ట్‌లు వంటి మూడు స్థాయిల్లో ఈ కోర్సులను గూగుల్ అందిస్తుంది. ముఖ్యంగా AI, డేటా, క్లౌడ్, ఆటోమేషన్‌లోని కీలక జాబ్ రోల్స్‌కు ఈ నైపుణ్యాలు చాలా అవసరం. స్కిల్ బ్యాడ్జ్‌లను ప్రారంభ స్థాయి నుంచే సంపాదించవచ్చు. పరిశ్రమ గుర్తింపు పొందిన Google క్లౌడ్ ధృవీకరణలకు అన్ని విధాలుగా మార్పు చేసుకోవచ్చు. దీనితో పాటు ప్రతి నెలా 35 ఉచిత క్లౌడ్ క్రెడిట్‌లను కూడా పొందొచ్చు. కాబట్టి మీరు కేవలం వీడియోల కోసం మాత్రమే కాదు.. దిగ్గజ టెక్ కంపెనీలు ఫోకస్ చేసే నిజమైన ప్రాజెక్ట్‌లను నిర్మిస్తున్నారు. ఇప్పటికే అనేక మంది లింక్డ్‌ఇన్‌లో పెద్దఎత్తున దరఖాస్తు చేసుకుంటూ, తమ ఆత్మవిశ్వాసం పెంపొందించుకుంటున్నారు. కెరీర్‌లో దూసుకుపోవాలనుకునే వారు వీటిని నేర్చుకోవడం మరింత తెలివైన పని అని నిపుణులు సైతం అభిప్రాయపడుతున్నారు. కంపెనీల్లో ఎక్కువగా డిమాండ్ ఉన్న స్కిల్స్ ఏమిటో తెలుసుకుని.. వాటిని పెంపొందించుకుంటే భవిష్యత్తు మీదే అని అంటున్నారు. కంపెనీలకు డిగ్రీల అవసరం కంటే నైపుణ్యం ఉన్న వ్యక్తులు అవసరం. కేవలం AI నేర్చుకోవడం మాత్రమే కాదు. Google నిశ్శబ్దంగా తన భవిష్యత్ వర్క్‌ఫోర్స్‌ను నిర్మిస్తోందన్న సంగతి మర్చిపోకూడదు. వారు ఇప్పుడు ఉచితంగా ఈ కోర్సుల్లో చేరమని ఆహ్వానిస్తున్నారు. AIలో గెలిచిన వారంతా ఫ్యాన్సీ డిగ్రీలు ఉన్నవారు కాదు. వారు వాస్తవాన్ని గ్రహించి స్కిల్స్ పెంపొందించుకుంటున్నారు. ఇప్పుడిప్పుడే AI యుగం ప్రారంభం అవుతోంది. ఈ క్రమంలో AI రైలు ఎక్కేందుకు Google మీకు ఫస్ట్‌క్లాస్ టిక్కెట్‌ను అందజేస్తుంది.

## మేడారం జాతరకు ప్రధాని మోదీ గిఫ్ట్

పనులు చేపట్టడానికి ఈ నిధులు విడుదల చేసింది. అంతకుముందు యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ అభివృద్ధి కోసం రూ. 140 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. మరోవైపు, జనవరి 28 నుంచి ప్రారంభం కానున్న మేడారం మహా జాతరకు వచ్చే ప్రజల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే, తెలంగాణ ఆర్టీసీ సమన్వయంతో ప్రత్యేక రవాణా ఏర్పాట్లు చేశాయి. దక్షిణ మధ్య రైల్వే 28 స్పెషల్ ట్రైన్లు నడపనున్నట్లు ప్రకటించింది. అయితే మేడారం గ్రామానికి నేరుగా రైలు మార్గం లేదు. కానీ సమీపంలోని వరంగల్, కాజీపేట స్టేషన్లకు చేరుకోవడానికి ఈ రైళ్లు ఎంతో ఉపయోగపడనున్నాయి. జనవరి 28, 29 తేదీల్లో ఈ ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయని రైల్వే శాఖ వెల్లడించింది. ఈ ప్రత్యేక రైళ్లు ప్రధానంగా సికింద్రాబాద్ నుంచి మంచిర్యాల, సిర్పూర్ కాగజ్‌నగర్ మార్గాల్లో రైళ్లు నడవనున్నాయి. అంతేకాకుండా నిజామాబాద్ నుంచి వరంగల్‌కు, కాజీపేట నుంచి ఖమ్మం, ఆదిలాబాద్ ప్రాంతాలకు స్పెషల్ రైళ్లు నడుస్తాయి. కాగా, మేడారం జాతరకు వచ్చే భక్తులు వరంగల్ లేదా కాజీపేట స్టేషన్లలో దిగిన తర్వాత.. అక్కడి నుంచి మేడారం చేరుకోవడానికి తెలంగాణ ఆర్టీసీ భారీగా బస్సులను ఏర్పాటు చేస్తోంది. రైల్వే స్టేషన్ల వద్దే ప్రత్యేక బస్ పాయింట్లను ఏర్పాటు చేస్తోంది. గతంలో కంటే ఈసారి సమన్వయం మెరుగ్గా ఉండటంతో ప్రయాణికులకు నిరీక్షణ సమయం తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

# మాయమై పోతున్నడమ్మా మనిషన్నవాడు



మాయమై పోతున్నడమ్మా మనిషన్నవాడు అనే పాటను అందెశ్రీ ఏ టైంలో పాడాడో కానీ. ఆర్థిక సంబంధాలతో ముడిపడి ఉన్న సమాజంలో మానవత్వం మంట కలుస్తోంది. ఆస్తి కోసమో, పడక సుఖం కోసమో క్షణికావేశంలో చంపేస్తున్నారు.. తెల్లారి లేస్తే భర్తను చంపిన భార్య, భార్యను చంపిన భర్త, ఆస్తి కోసం తండ్రి అంత్యక్రియలను నిలిపివేశాడు కుమారుడు ఇవే కనిపిస్తున్నాయి. తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భావించి ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య.. ప్రియురాలితో కలిసి జీవించేందుకు భార్య ప్రాణాలు తీసిన భర్త! ఇటీవలికాలంలో తరచుగా కనిపిస్తున్న వార్తలివి!! భర్త ఎల్లప్పుడూ తిడతాడనో.. భార్య సాధిస్తోందనో.. కారణాలేవైనాగానీ ఇతరుల పట్ల ఆకర్షితులవుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. వివాహేతర బంధాలు కాపురాల్లో చిచ్చు పెడుతున్నాయి! నిండు సంసారాల్లో నిప్పులు పోస్తున్నాయి!! బంధుమిత్రుల ఆశీస్సులతో అల్లుకున్న పవిత్ర బంధం క్షణిక సుఖాల ప్రకంపనలతో కుప్పకూలుతోంది. వలచినవారి కోసం కట్టుకున్నవారే కాలయములుగా మారడం.. జీవిత భాగస్వామిని అత్యంత క్రూరంగా చంపి.. శవాన్ని ముక్కలు చేయడం, తగలబెట్టేయడం, రాళ్లు కట్టి జల సమాధి చేయడం ఆందోళన కలిగిస్తోంది. కడకంటా ఒకరికొకరు తోడుండాల్సిన దంపతులు.. తాత్కాలిక ఆకర్షణలకు లోనై ప్రాణాలు తీసే స్థాయికి దిగజారడం సామాజిక విలువల పతనానికి అద్దం పడుతోంది. వివాహేతర సంబంధాల కారణంగా ఒళ్లు గగుర్పొడిచే ఇలాంటి అత్యంత క్రూరమైన హత్యలు గత ఏడాది కాలంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో 705 నమోదయ్యాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. తెలుగు గడ్డపై రోజుకో చోట నమోదవుతున్న ఈ తరహా దారుణహత్యలు, అక్రమ సంబంధాల నేపథ్యంలో జరుగుతున్న ఘోరాలు సమాజానికి ఒక హెచ్చరికను పంపిస్తున్నాయి. గతంలో భార్యాభర్తల మధ్య గొడవలు వస్తే.. పెద్దలు కూర్చుని పరిష్కరించేవారు. దంపతులు కూడా పెద్దలు చెప్తే విని.. ఓర్పు, సహనంతో వ్యవహరించేవారు. కానీ, ఇటీవలికాలంలో ఓర్పు, సహనం తగ్గి 'ఈగో' మరింత పెరగడం.. భాగస్వామితో గొడవైనప్పుడు సోషల్ మీడియా ద్వారానో, ఇంటి చుట్టుపక్కలో పరిచయమైన పరాయి వ్యక్తుల సాన్నిహిత్యానికి ఆకర్షితులు కావడం పెరుగుతోంది. ఆ తాత్కాలిక వ్యామోహాలు చివరకు హత్యలకు సైతం దారితీస్తున్నాయి. గడిచిన ఐదేళ్ల కాలంలో (2021 నుంచి 2025 నడుమ) ఈ తరహాలో 2,725 హత్యలు జరిగాయని గణాంకాలు చెబుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో నమోదైన మొత్తం హత్య కేసుల్లో 20 నుంచి 25% మేర ఈ తరహావే ఉంటున్నాయి. టీవీలు, ఓటీటీలు, సోషల్ మీడియా.. ఇవేవీ లేని కాలంలో భార్యాభర్తల మధ్యే కాదు, కుటుంబంలో అందరి మధ్య అనుబంధాలు, ఆత్మీయతలు ఉండేవి! ఇంటి హాల్లోకి టీవీలు, వాటికి కేబుల్ కనెక్షన్లు వచ్చాక.. ఒకరితో మరొకరు మాట్లాడుకోవడం తగ్గింది. ఆ టీవీలతోపాటు ఫోన్లు సైతం బెడ్‌రూమ్‌లోకి చొచ్చుకొచ్చాక.. జీవితాల్లోకి సోషల్ మీడియా భూతం ప్రవేశించాక.. ఎవరి లోకం వారిదే అన్నట్టుగా తయారైంది. భార్యాభర్తలు ఒకే మంచం మీద ఉన్నా.. ఇద్దరూ తమ ఫోన్లలో మునిగిపోతున్నారు. మనసు విప్పి మాట్లాడుకునే సమయం లేకపోవడం వల్ల బయటి వ్యక్తుల 'హాయ్'లు, 'గుడ్ మార్నింగ్'లు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. సోషల్ మీడియాలో వచ్చే లైక్‌లు, కామెంట్‌లు నిజమైన ప్రేమ అని భ్రమపడుతున్నారు. ఆ మాయలో పడి నూరేళ్ల బంధాన్ని కాలరాస్తున్నారు. 60 శాతం వివాహేతర సంబంధాలకు కారణం స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియానే అని తేలుతోంది! సినిమాలు, వెబ్ సిరీస్‌లలో విచ్చలవిడి లైంగిక సంబంధాలను ఒక గొప్ప జీవనశైలిగా చూపడం, నేరం చేసి ఎలా తప్పించుకోవాలో విశదీకరించడం బలహీన మనస్తత్వం గలవారిని ప్రభావితం చేస్తోంది. హత్యలను గ్లామరైజ్ చేయడం వల్ల.. తప్పు చేసినా దొరకకుండా ఉండొచ్చనే భ్రమలో చాలా మంది నేరాలకు పాల్పడుతున్నారు. జీవిత భాగస్వామి నచ్చకపోతే.. వేరొకరితో బంధమే కావాలని బలంగా అనిపిస్తే.. విడాకులు తీసుకోవచ్చు. ఒకప్పుడు విడాకులు తీసుకున్నవారిని చిన్నచూపు చూసేవారుగానీ.. ఇటీవలి కాలంలో అది అసలు పెద్ద విషయమే కాదన్నట్టుగా పరిస్థితి మారింది. అయినా, ఆ ప్రత్యామ్నాయాన్ని చాలా మంది ఎంచుకోవట్లేదు. వెబ్‌సిరీస్‌ల్లోనో, సినిమాల్లోనో, యూట్యూబ్‌లోనో చూసి హత్యలకు పాల్పడుతున్నారు. అద్భుతమైన టెక్నాలజీ అందుబాటులో ఉన్న ఈ రోజుల్లో హత్య చేసి తప్పించుకోవడం దాదాపు అసాధ్యమనే విషయం కూడా వారికి అర్థం కానంత మత్తులో కూరుకుపోవడమే ఈ హత్యలకు కారణం. గతంలో ఈ తరహా హత్యలు క్షణికావేశంలో జరిగేవి. కానీ, ఇప్పుడు రోజుల తరబడి ప్రణాళికలు రచించి.. సుపారీ సైతం ఇచ్చి కిరాయి హంతకులతో చంపిస్తున్న ఘటనలు 40% పెరిగాయి! గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే.. పట్టణ ప్రాంతాల్లో ఈ తరహా నేరాలు ఎక్కువగా నమోదవుతున్నాయి. హత్యలే కాదు.. తమ వివాహేతర సంబంధం గురించి జీవితభాగస్వామికి/ఇతరులకు తెలిసిపోయిందన్న అనుమానంతో/ అవమానంతో, భాగస్వామి చేతిలో మోసపోయామన్న బాధతో ఆత్మహత్య చేసుకుంటున్నవారూ ఉన్నారు. గతంతో పోలిస్తే ఈ తరహా ఆత్మహత్యలు 18% దాకా పెరిగాయని గణాంకాలు చెబుతున్నాయి. భార్యాభర్తల్లో ఎవరో ఒకరు వేసే తప్పటడుగు.. వారి పిల్లల పాలిట శాపంగా మారుతోంది. వివాహేతర సంబందాల వల్ల ఎక్కువగా నష్టపోతోంది అమాయకమైన పిల్లలే. గత ఐదేళ్లలో ఈ తరహా హత్యల వల్ల దాదాపు 2500 మందికి పిల్లలు అనాథలయ్యారని గణాంకాలు చెబుతున్నాయి. 'తల్లిని చంపి తండ్రి (లేదా) తండ్రిని చంపి తల్లి జైలుకు వెళ్తే.. ఆ పిల్లల పరిస్థితి ఏమిటి? ఏం పాపం చేశారని వారికి శిక్ష అనే ఆలోచనే మనసులను కలచివేస్తుంది. అమ్మానాన్నల్లో ఒకరు కాటికి.. మరొకరు జైలుకు వెళ్తే.. ఆ పిల్లల గోడు ఎవరికి వినబడుతుంది? తల్లిదండ్రుల మధ్య గొడవలు, ఒకరిని ఒకరు చంపుకోవడం చూసిన ఆ పసి మనసులు ఎంతగాయపడతాయో కదా! రేపటి పౌరులుగా ఎదగాల్సిన పిల్లలు.. అనాథలుగా మారి నేరగాళ్ల నీడలో పెరిగితే? పెరిగి పెద్దయ్యాక నేరగాళ్లుగా మారితే.. ఆ తప్పెవరిది? వివాహేతర సంబంధాల నేపథ్యంలో జరుగుతున్న హత్యల ఉపద్రవం నుంచి బయటపడాలంటే.. మన ఆలోచన తీరు మారాలి. భాగస్వామిపై అనుమానం కలిగితే నిఘా పెట్టడం మానేసి నేరుగా మాట్లాడాలి. మనస్పర్థలు వస్తే.. మూడో వ్యక్తితో కాకుండా భాగస్వామితో చర్చించాలి. సమస్య తీవ్రమైతే కౌన్సెలింగ్‌ను ఆశ్రయించాలి. ఫోన్లను పక్కన పెట్టి.. భాగస్వామితో, పిల్లలతో ఎక్కువ సమయం గడపాలి. చిన్నతనం నుంచే కుటుంబ వ్యవస్థ పట్ల పిల్లల్లో గౌరవాన్ని పెంచాలి. భాగస్వామి తప్పు చేశారని తెలిసినప్పుడు (లేదా) వారికి బదులుగా వేరొకరు నచ్చినప్పుడు.. చట్టబద్ధంగా విడాకులు తీసుకుని విడిపోయే అవకాశం కూడా ఉంటుంది. హత్య చేసి జీవితాన్ని నాశనం చేసుకోవడం పరిష్కారం కాదు. ఆవేశంలో చేసే హత్యలు జీవితాన్ని జైలు గోడల మధ్య బంధిస్తాయి.. పిల్లల భవిష్యత్తును అంధకారం చేస్తాయి.

## కేటీఆర్ ను విచారిస్తున్న సీపీ, ఏసీపీ



ఉదయం నందిహిల్స్ నుంచి హరీశ్‌రావుతో కలిసి కేటీఆర్ తెలంగాణ భవన్‌కు వచ్చారు. అక్కడ ఆయనకు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. మహిళా నేతలు ఆయనకు తిలకం దిద్ది ఆశీర్వదించారు. అనంతరం ఆయన ముఖ్య నాయకులతో కీలక సమావేశం నిర్వహించారు. తర్వాత మీడియాతో మాట్లాడారు. తననే టార్గెట్ చేసుకొని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి దుష్ప్రచారం చేస్తోందని ఇప్పుడు జరుగుతున్నది అదేనంటూ విమర్శలు చేశారు. మీడియా సమావేశం తర్వాత హరీష్‌రావుతో కలిసి సిట్ కార్యాలయానికి కేటీఆర్ వచ్చారు. చాలా దూరంలో అందరి వాహనాలను పోలీసులు ఆపేశారు. కేవలం కేటీఆర్ హరీష్‌రావు వాహనాలను పీఎస్ వరకు అనుమతి ఇచ్చారు. పీఎస్ వరకు హరీష్‌రావుతో వచ్చిన కేటీఆర్ ఒక్కడినే విచారణకు అనుమతి ఇచ్చారు. విచారణ జరుగుతున్న టైంలోనే జూబ్లీహిల్స్ చెక్ పోస్టు వద్ద బీఆర్‌ఎస్ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. తమను అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశాయి. ముందే తమను తమ నేతలను అడ్డుకోవడంపై మండిపడ్డాయి. అయినా పోలీసులు వారిని నియంత్రించి అక్కడి నుంచి పంపేశారు. ఇలాంటివి జరుగుతాయని ముందే గ్రహించిన పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. విద్యార్థి నాయకులను ముందుగానే అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లోని పలువురు లీడర్లను ఇంటి నుంచి రానీయలేదు

**రాధాకిషన్ రావుతో కలిసి విచారణ**

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ కేసులో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విచారణ కొనసాగుతోంది. సిట్ అధికారులు జారీ చేసిన నోటీసుల మేరకు ఈ ఉదయం కేటీఆర్ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని సిట్ ఎదుట హాజరయ్యారు. జాయింట్ సీపీ విజయ్‌కుమార్, ఏసీపీ వెంకటగిరి ఆయనను ప్రశ్నిస్తున్నారు. ఈ విచారణకు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఎందుకంటే, ఈ కేసులో ఏ3గా ఉన్న మాజీ డీసీపీ రాధాకిషన్ రావును కూడా సిట్ అధికారులు అదే పీఎస్‌కు విచారణకు పిలిపించారు. ప్రస్తుతం కేటీఆర్, రాధాకిషన్ రావులను ఎదురెదురుగా కూర్చోబెట్టి క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తున్నట్లు సమాచారం. ఇదివరకు విచారణ సందర్భంగా "పెద్దాయన ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్ జరిగింది" అంటూ రాధాకిషన్ రావు వాంగ్మూలం ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో.. ఆ 'పెద్దాయన' ఎవరు? ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించిన అసలు ఆదేశాలు ఎక్కడి నుంచి వచ్చాయి? అన్న దానిపై సిట్ అధికారులు లోతైన కూపీ లాగుతున్నట్లు తెలుస్తోంది.

**సిరిసిల్ల కేంద్రంగా వ్యవహారం - బండి**

సిరిసిల్లను కేంద్రంగా చేసుకొని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అక్రమంగా ఫోన్లను ట్యాపింగ్ చేయించారని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ సీరియల్ మాదిరిగా సాగుతోందని ఎద్దేవా చేశారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సిట్ విచారణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నాటకాలు ఆడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ చేసిన దారుణాల వల్ల కొన్ని కుటుంబాలు నిండా మునిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎలాంటి అరెస్టులు జరగవని అన్నారు. అవినీతి, అక్రమ కేసుల్లో కేసీఆర్ కుటుంబాన్ని అరెస్టు చేసే ధైర్యం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి లేదని విమర్శించారు. దేశ భద్రత కోసం కూడా ఫోన్ ట్యాపింగ్ జరుగుతుంటుందని, దానికి తెలంగాణలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి ఏమాత్రం సంబంధం లేదని అన్నారు. మావోయిస్టుల పేరుతో హీరోయిన్లు, వ్యాపారులు, రాజకీయ నేతలు, జడ్జిల ఫోన్లను ట్యాప్ చేశారని ఆరోపించారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)లో మంచి అధికారులు ఉన్నారని పేర్కొన్నారు. కానీ వారికి ఈ ప్రభుత్వంలో స్వేచ్ఛగా విచారణ జరిపే అవకాశం లేకుండా పోయిందని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఒక్క రాజకీయ నాయకుడినైనా అరెస్టు చేశారా అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉండి ఉంటే కేసీఆర్ కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకునే వాళ్లమని అన్నారు. తప్పు చేసిన నేతలు, అధికారులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు

**ఎవ్వరిని వదిలిపెట్టం**

తెలంగాణలో శ్రుతిమించి ప్రవర్తిస్తున్న అధికారులు భవిష్యత్‌లో ఇబ్బందులు పడతారని బీఆర్‌ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు వార్నింగ్ ఇచ్చారు. దావోస్‌లో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లో ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తే వచ్చే కాలంలో కేసుల్లో ఇరుక్కుంటారని హెచ్చరించారు. రిటైర్మెంట్‌కు దగ్గర్లో ఉన్నాం తర్వాత ఎవరూ ఏం చేయలేరనే ధీమా వద్దని కూడా చెప్పారు. రిటైర్మెంట్ తర్వాత సప్త సముద్రాల అవతల దాక్కున్నా లాక్కొచ్చి చట్టం ముందు నిలబెడతామని సీరియస్ అయ్యారు. కేటీఆర్‌తో సిట్ కార్యాలయం వరకు వచ్చిన ఆయన అక్కడ మీడియాతో మాట్లాడారు. పోలీసు అధికారులు, ప్రభుత్వాధికారులు న్యాయబద్ధంగా వ్యవహరించాలని, చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని హరీష్‌రావు సూచించారు. వాటిని మీరితే మాత్రం తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. ఇప్పుడు ప్రభుత్వం అండగా ఉండవచ్చేమో కానీ రేపటి రోజున కచ్చితంగా ఇంతకింతా అనుభవిస్తారని అన్నారు. అప్పుడు సొంత డబ్బులు పెట్టి కేసులు వాదించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. తమపై చాలా కాలం నుంచి దుష్ప్రచారం చేస్తున్న రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో పోలీసులు చెప్పాలని ప్రశ్నించారు. ఇప్పుడు జరుగుతున్నదంతా కేవలం రాజకీయ కక్ష సాధింపేనని హరీష్ అభిప్రాయపడ్డారు. వివిధ స్కామ్‌లలో ఇరుక్కున్న ప్రభుత్వ పెద్దలు వాటి నుంచి ప్రజల దృష్టిని డైవర్ట్ చేయడానికే విచారణ పేరుతో వేధిస్తున్నారని ఆరోపించారు. ఎన్ని విధాలుగా వేధించినా తమ పోరాటం మాత్రం ఆపేది లేదని ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతూనే ఉంటామని అన్నారు.

# ఆరు మున్సిపాలిటీలు కాంగ్రెస్ కైవసమే..

- సన్నాహక సమావేశంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు
- తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క దిశా నిర్దేశం
- సమిష్టి కృషితో లక్ష్యాన్ని సాధిస్తామన్న ప్రభుత్వ విప్, యాదాద్రి భువనగిరి జిల్లా డీసీసీ అధ్యక్షుడు బీర్ల అయిలయ్య



**జయభేరి, యాదాద్రి భువనగిరి జిల్లా :**

యాదాద్రి భువనగిరి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల పై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసేందుకు ప్రతి ఒక్క నాయకుడు కార్యకర్త కృషి చేయాలని,సమన్వయంతో ముందుకు సాగాలని తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి, భువనగిరి పార్లమెంటు ఎన్నికల ఇంచార్జి సీతక్క కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వ పథకాలు, ప్రజల ఆశీర్వాదం,అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల విశేష ప్రచారంతో యాదాద్రి భువనగిరి జిల్లాలోని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని కాంగ్రెస్ పార్టీ శ్రేణుల హర్షధ్వానాల మధ్య ప్రభుత్వ విప్, జిల్లా డీసీసీ అధ్యక్షుడు,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రకటించారు. భువనగిరి పట్టణంలోని న్యూ వివేర్ హోటల్ లో యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల ఎన్నికలు సందర్భంగా నిర్వహించిన సన్నాహక సమావేశంలో తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి,భువనగిరి పార్లమెంట్ ఎన్నికల ఇంచార్జి సీతక్క ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సన్నాహక సమావేశంలో ప్రభుత్వ విప్,జిల్లా డీసీసీ అధ్యక్షుడు,ఆలేరు ఎమ్మెల్యే అయిలయ్య,భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి,తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్,తెలంగాణ రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ ఛైర్మన్ బండ్రు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



**ఆకట్టుకున్న బీర్ల అయిలయ్య ప్రసంగం...**

ఈ సన్నాహక సమావేశంలో బీర్ల అయిలయ్య మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలోని జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వాటినుంచి ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పాలన సాగుతోందని తెలిపారు.

**సంక్షేమ పథకాలపై ఫోకస్**

మహిళలకు వడ్డీలేని రుణాలు, రైతులకు రైతుభరోసా,యువతకు ఉపాధి అవకాశాలు వంటి సంక్షేమ పథకాలు ప్రజల్లో కాంగ్రెస్ పైన నమ్మకాన్ని మరింత పెంచాయని బీర్ల అయిలయ్య అన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త బూత్ స్థాయి నుంచి సమన్వయంతో పనిచేస్తూ,ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యతతో ముందుకు సాగితే విజయాన్ని ఎవ్వరూ ఆపలేరని స్పష్టం చేశారు.

# ఘనంగా వసంత పంచమి, నేతాజీ జయంతి వేడుకలు

**జయభేరి, తుర్కపల్లి, జనవరి 23 :**

తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వసంత పంచమి, నేతాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ మాత విగ్రహానికి పూలమాలవేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూజించారు. నేతాజీ 129వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు బాలమని మాట్లాడుతూ 1897 లో జన్మించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ సాయుధ పోరాటం ద్వారా ఆంగ్లేయులను దేశం నుండి తరిమి వెయ్యవచ్చని నమ్మి అది ఆచరణలో పెట్టినాడని అన్నారు. నాకు రక్తాన్ని ఇవ్వండి మీకు స్వతంత్రాన్ని ఇస్తాను అని భారత ప్రజల్లో స్వతంత్ర సమర కాంక్షను రగిలించారని అన్నారు. చంద్రబోస్ రెండుసార్లు భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికైన గాంధీతో సిద్ధాంతపరమైన అభిప్రాయ భేదాలు వలన ఆ పదవికి రాజీనామా చేశాడని అన్నారు. గాంధీ యొక్క హహింస వాదం మాత్రమే స్వతంత్ర సాధనకు సరిపోదని పోరుబాట కూడా ముఖ్యమని బోస్ భావనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బోళ్ల శ్రీనివాసరెడ్డి ,భాశెట్టి విష్ణు, హసీనా బేగం, మోతే వేణుగోపాల్, మందడి వీర జంగారెడ్డి, మహమ్మద్ అమీర్, ఏనుగు విజయ, పోరెడ్డి కవిత, మహమ్మద్ గౌస్, షబానా, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



# గ్రామ అభివృద్ధికి కృషి చేయాలన్న మహిళలు

- అభివృద్ధికి అందరం కట్టుబడి ఉంటామన్న నూతన పాలకమండలి నాయకులు
- మహిళా సంఘం ఆధ్వర్యంలో నూతన పాలకమండలి నాయకులకు సన్మానం



**జయభేరి, షాద్ నగర్, జనవరి 23 :**

నాగులపల్లి గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు మహిళా సంఘం అధ్యక్షురాలు అరుంధతి వెంకట్ రెడ్డి, కార్యదర్శి భాగ్యమ్మ, కోశాధికారి చెన్నమ్మ, ఉపాధ్యక్షులు విజయ లక్ష్మీ, సహాయకార్యదర్శి వెంకటమ్మ, మహిళా సంఘం మహిళల ఆధ్వర్యంలో ఘనంగా నాగులపల్లి నూతన పాలకమండలి నాయకులకు ఘనంగా సన్మాన కార్యక్రమం. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం నాగులపల్లి గ్రామ సర్పంచ్ నాల్లపురం రాధిక అశోక్ రెడ్డి ఉప సర్పంచ్ కిరణ్ గౌడ్, వార్డు సభ్యులు... జి.బౌరయ్య, ఎ.లక్ష్మీ నర్సమ్మ ,వి.స్వామి, ఎం.కుమార్, సబిత తదితరులకు మహిళా సంఘం మహిళలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహిళా సంఘం మహిళలు మాట్లాడుతూ... నూతన నాగులపల్లి పాలకమండలి నాయకులు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి అన్ని విధాలుగా గ్రామాన్ని అభివృద్ధి చేసే దిశగా పనిచేయాలని అన్నారు. గ్రామ సర్పంచ్ , ఉప సర్పంచ్, వార్డు సభ్యులు మాట్లాడుతూ.... మహిళా సంఘం మహిళల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినందుకుగాను హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం అందరం కలిసికట్టుగా స్వయంకృషితో పనిచేసి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి వైపు నడిపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బుక్ కీపర్ సరిత, సంతోష, మంజుల, లక్ష్మమ్మ, పుషమ్మ, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

# వసంత పంచమి వేడుకలు

**జయభేరి, దేవరకొండ :**



వాసవి క్లబ్, వాసవి వనిత గ్రేటర్ దేవరకొండ ఆధ్వర్యంలో శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయం దేవరకొండలో వసంత పంచమి సందర్భంగా జ్ఞాన సరస్వతి దేవాలయంలో సరస్వతి శిశు మందిర్ ఆవరణంలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించబడింది. ఈ అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి చిన్నారులకు వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ గ్రేటర్ దేవరకొండ ఆధ్వర్యంలో పలక బలపం పెన్ను బుక్కు ఎగ్జామ్ ప్యాడ్ తో ఒక కిట్టు తయారు చేసి ఇవ్వబడినది ఇట్టి కార్యక్రమంలో వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు పందిరి జ్యోతి, కార్యదర్శి బెజవాడ మల్లేశ్వరి, కోశాధికారి ఆలంపల్లి శిరీష, వాసవి క్లబ్ అధ్యక్షులు అతుకూరి ఆంజనేయులు, కార్యదర్శి బెల్లిదే రవీందర్, కోశాధికారి పందిరి వెంకన్న, వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ సభ్యులు సాయిబాబా దేవాలయ ట్రస్ట్ చైర్మన్ ఇల్లెందుల శ్రవణ్ కుమార్, కార్యదర్శి దొడ్డి సుధాకర్, కోశాధికారి కార్నటి జనార్ధన్, మాజీ మున్సిపల్ చైర్మన్ అలంపల్లి నరసింహ, దొడ్డి వెంకటేశ్వర్లు, వాసా వెంకటేశ్వర్లు, కుంచకూరి సంధ్య, వాసవి క్లబ్ జోన్ చైర్మన్ కొత్త సావిత్రి సుబ్బారావు, వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ జాయింట్ ట్రెజరర్ నీల సంజీవ కుమార్, అల్లంపల్లి పద్మ, హరిత, శాంత, సంధ్య, కల్పన, శోభ పాల్గొన్నారు.



# యాదగిరిగుట్టలో రౌడీషీటర్ దారుణ హత్య

**జయభేరి, యాదగిరిగుట్ట, జనవరి 23:**

యాదగిరిగుట్టలో రౌడీషీటర్ నిశాంత్ దారుణ హత్యకు గురయ్యాడు. యాదగిరిగుట్ట సిఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం యాదగిరిగుట్ట మున్సిపల్ పరిధిలోని మైలార్ గూడెం హరిహర కాటేజ్ లో నిశాంత్ ఠాకూర్ అనే రౌడీ షీటర్ ను ఇద్దరు స్నేహితులు కత్తితో పొడిచి హత్య చేశారు. నిశాంత్ పై 11 కేసులు ఉన్నాయి. నిశాంత్ ను పట్టణం నుంచి పంపించిన తర్వాత 4 నెలల క్రితం మళ్ళీ యాదగిరిగుట్టకు వచ్చాడని, ఇటీవలే మళ్ళీ ఓ కేసులో రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. జైలు నుంచి విడుదలైన తర్వాత స్నేహితులతో కలిసి మద్యం సేవించే క్రమంలో గొడవ జరిగిందని, స్నేహితుడిని నిశాంత్ ఇటుకతో కొట్టగా ఆగ్రహించిన మరో మరొకరు నిశాంత్ ను పట్టుకోగా కత్తితో పొడిచి పరారైనట్టు తెలిపారు. మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు.

# మేడారం సమ్మక్క–సారలమ్మల బంగారం ప్రసాదం



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు మేడారం సమ్మక్క-సారలమ్మల బంగారం ప్రసాదాన్ని TGSRTC లాజిస్టిక్స్ సేవల ద్వారా అందుకునే అవకాశం కల్పించినట్లు డిపో మేనేజర్ విజయ కుమారి, అసిస్టెంట్ P. సైదులు తెలిపారు. శుక్రవారం డిపో కార్యాలయంలో ప్రసాదానికి సంబంధించిన కరపత్రాలను ఆమె ఆవిష్కరించారు. మేడారం జాతరకు వెళ్లలేని భక్తులు కూడా తమ ఇంటివద్దకే ప్రసాదం అందుకునేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. దేవాదాయ శాఖ సహకారంతో రూపొందించిన ఈ ప్రసాద ప్యాకేజీలో దేవతల ఫోటోలు, బెల్లం, పసుపు, కుంకుమ ఉంటాయని తెలిపారు. ఈ ప్యాకేజీ కోసం భక్తులు రూ.299 చెల్లించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం డిపో కార్గో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ N హరిలాల్ సెల్ నంబర్: 9154298694 ను సంప్రదించాలని డిపో మేనేజర్ కోరారు.



# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్

**జయభేరి, యాదగిరిగుట్ట, జనవరి 23 :**

ఇంటర్మీడియట్ సెక్రటరీ శ్రీకృష్ణ ఆదిత్య ఆదేశాల మేరకు యాదగిరిగుట్ట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ ను విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మంజుల,అధ్యాపక బృందం, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు విద్య కోసం అందిస్తున్న వివిధ విద్యా సంక్షేమ సౌకర్యాలపై అవగాహన కల్పించారు. ఉచిత విద్య,ఉచిత పాఠ్యపుస్తకాలు,డిజిటల్ తరగతులు,సీసీ కెమెరాలు, ప్రయోగ పరికరాలు,క్రీడా సామాగ్రి,కెరీర్ గైడెన్స్ వంటి అంశాలను ప్రిన్సిపల్ మంజుల వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాలలో చదివి ప్రభుత్వం ఉద్యోగం మరియు ఉన్నత స్థాయిలో ఉద్యోగం సాధించిన పూర్వ విద్యార్థుల అనుభవాలను ఇప్పుడు చదువుతున్న విద్యార్థులకు తెలియజేశారు. అలాగే పూర్వ విద్యార్థుల యొక్క తల్లిదండ్రులను అందరి సమక్షంలో సన్మానించారు, వారికి కళాశాలలో ప్రభుత్వం కల్పించినటువంటి సౌకర్యాలను ప్రత్యక్షంగా చూపించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల అధ్యాపక బృందం అసహేలు,రాజు, కృష్ణయ్య,బలరాం,రమేష్, రాంబాబు,మహేష్, హైమావతి,సుబ్బలక్ష్మి, నాగలక్ష్మి,పద్మ రేఖ,రజిత, యాదగిరి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి లోకేష్ జన్మదిన వేడుకలు

- యాదగిరిగుట్టలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు :శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారికి ప్రత్యేక పూజలు



**జయభేరి, యాదగిరిగుట్ట, జనవరి 23 :**

తెలంగాణ రాష్ట్రంలోని తెలుగుదేశం పార్టీ పునర్వైభవానికి కృషి జరుగుతోందని ఆ పార్టీ నాయకులు తెలిపారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ ,విద్యా శాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు జన్మదిన వేడుకలు యాదగిరిగుట్టలో ఘనంగా నిర్వహించారు. యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బక్కని నరసింహులు యాదగిరిగుట్ట పట్టణంలోని విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోని పార్టీ పునర్నిర్మాణానికి నారా లోకేష్ బాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు కుందారపు కృష్ణ చారి, ఆలేరు నియోజకవర్గం ఇంచార్జి రేగు బాల నరసయ్య, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు అశోక్, ఉపాధ్యక్షులు డీజే మూర్తి,ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవులు, టిడిపి పార్టీ నాయకులు నర్సింగరావు, సాయి, నాగార్జున్, కళ్యెం బాబు రావు, మచ్చ నరసింహ గౌడ్, గుండా భాస్కర్,వనమాల సత్యనారాయణ, ముక్కెర్ల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వసంత పంచమి వేడుకలు



**జయభేరి, తుర్కపల్లి, జనవరి 23 :**

తుర్కపల్లి మండలం ములకలపల్లి గ్రామ పరిధిలోని విశ్వభారత్ గ్లోబల్ స్కూల్లో శుక్రవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి మాత చిత్రపటానికి పూలమాలవేసి పూజించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులందరూ సరస్వతీ మాత కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులు కూడా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి లక్ష్యం నెరవేర్చుకునే దిశగా ప్రయత్నాలు కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లావణ్య, రామలీల, రాజేశ్వరి, శైలజ, కల్పన, శిరీష, స్వీటీ రెడ్డి, కవిత, నవనీత, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# కల్వ మానసను అభినందించిన భక్తులు



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వసంత పంచమి పర్వదిన వేడుకల సందర్భంగా స్థానికుడైన కల్వ నరేష్ కూతురు మానస వేసిన సరస్వతి దేవి ముగ్గు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. దీంతో ముగ్గు వేసిన మానసను భక్తులు అభినందించారు.

# దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి

- సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి పిలుపు



జయభేరి, పరవాడ:

ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సమ్మెలో కార్మికుల, రైతులు భాగస్వాములు కావాలని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. పరవాడ సిఐటియు కార్యాలయంలో శుక్రవారం సమావేశం జరిగింది. సమావేశంలో సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్డీఏ హయంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలు మార్చవద్దని కేంద్ర కార్మిక సంఘాలు ఎంత హితవు పలికిన పెడదోవన పెట్టారన్నారు. బీహార్ ఎన్నికల తర్వాత మరింత వేగం పెంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక వర్గంలో ఎంత వ్యతిరేకత వచ్చినప్పటికీ, తమ విధానాలు అమలు చేయడం బిజెపి లక్ష్యంగా పెట్టుకుందని అర్థమవుతుందన్నారు. బిజెపి విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులకు పెద్ద ఎత్తున కదిలి రావాలని గని శెట్టి పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 12 పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నాలన్నారు. సంఘటిత, అసంఘీత కార్మికులు వీధుల్లోకి వచ్చి పోరాటం చేయడం ద్వారా బిజెపి ప్రభుత్వ తలొగ్గాలా ఉండాలన్నారు. లేదంటే బిజెపికి షాక్ తగలదని ఎద్దేవా చేశారు. రాష్ట్ర కూటమి ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ ఈ రాష్ట్రంలో సమ్మెను విఫలం చేసి ప్రయత్నం చేస్తుందని చెప్పారు. అందుకోసం తన అన్ని శాఖల్ని మనపై ఎక్కువ పెట్టిందని చెప్పారు. ఈ దుర్గటనను కూడా కార్మికులు ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలనే పిలుపునిచ్చారు. పోరాడి సాధించిన 8 గంటలను 10 గంటలు చేయడాన్నిగని శెట్టి తీవ్రంగా ఖండించారు. ఫిబ్రవరి 12 సమ్మెకు రాష్ట్రంలో ప్రధాన సంఘటిత రంగాలైన రవాణ రంగాలైన రైల్వే, బస్సు, ఆటో లను నిలుపుదల చేయలన్నారు. బ్యాంకు, ఇన్సూరెన్స్, అన్ని రంగాల కార్మికులు ముందుండి పోరాడితే తప్ప ఈ సమ్మె విజయవంతం చేయాలన్నారు. రాష్ట్రప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పాలు చేసిన సమ్మె విజయవంతం కావడం ఖాయమన్నారు. రైతాంగం ఢిల్లీ వీధుల్లో కేంద్ర రాజధానిలో ఏడాది పాటు ఏవిధంగా పోరాటం చేశారో, ఆవిధంగా చేస్తేతప్ప బిజెపి కేంద్ర ప్రభుత్వం దిగిరాదన్నారు. లేదంటే ఈ ప్రభుత్వాన్ని మేడలు వంచటం అసాధ్యం అవుతుందని కార్మికులకు గుర్తించాలన్నారు. ఈనెల 23 కి అన్ని రంగాల్లో నోటీసులు ఇవ్వాలని కోరారు. ఫిబ్రవరి 9న రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో, డివిజన్లో ప్రచారం ముమ్మరం చేయాలన్నారు. 12వ తేదీ సమ్మెకు కార్మికులు, రైతులు, కౌలు రైతులు, ఉపాధి హామీ కూలీల సమ్మెలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు మండల కన్వీనర్ కే రమణి, వివో ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటలక్ష్మి, ఎన్టిపిసి కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పి గోవిందరాజు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



## వాసవి మాత ఆలయంలో ఘనంగా వసంత పంచమి వేడుకలు

జయభేరి, దేవరకద్ర, :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అర్చకుడు తరిమల హరి శంకర శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోత్తంగా, సాంప్రదాయ రీతిలో వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే మాఘమాసం వసంత పంచమి సందర్భంగా పంచామృతాభిషేకాలతో అమ్మవారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు.మహా మంగళ హారతి తో పాటు అమ్మవారికి వెండి చీర ధరింపజేసి ఈ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ కల్వ కన్నయ్య శెట్టి, మహిళా సంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజులరాణి, వీహెచ్ పి జిల్లా మాజీ అధ్యక్షుడు గుద్దేటి చంద్రయ్య, యువజన సంఘం అధ్యక్షుడు దోమ హరికాంత్ లతోపాటు స్థానిక ఆర్యవైశ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అలింకో సహాయ ఉపకరణాల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని సిడిపిఓ కార్యాలయం వద్ద శుక్రవారం అలింకో సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పాల్గొన్నారు. సిడిపిఓ కార్యాలయం వద్ద మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో దేవరకద్ర నియోజకవర్గానికి సంబంధించి అలింకో సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## హృదయపూర్వక అభినందనలు



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్‌నగర్ జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఐఏఎస్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా శుక్రవారం గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎం. శంకర్, జిల్లా అధ్యక్షులు కంగురాం నాయక్, జనరల్ సెక్రటరీ సుభాష్ నాయక్, గౌరవ అధ్యక్షులు ఎన్.టి. రామ్ నాయక్, అలాగే దేవజా నాయక్, శంకర్ నాయక్, తారా సింగ్ నాయక్, వర్త్య శంకర్, తారా సింగ్ జడ్చర్ల తదితరులు కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపినట్లు గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర జాయింట్ కార్యదర్శి శంకర్ తెలిపారు.

## ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి



జయభేరి, మేడ్చల్ :

పోరాటం ద్వారానే భారత దేశానికి స్వాతంత్ర్యం వస్తుందని నమ్మిన పోరాట యోధుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ అని గుండ్లపోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గరిసెల సురేందర్ ముదిరాజ్ తెలిపారు. శుక్రవారం స్వాతంత్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని గుండ్లపోచంపల్లి డివిజన్ గౌడవల్లిలోని సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాజీ సర్పంచ్ గరిసెల సురేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యానికి వెన్నులో వణుకు పుట్టించిన ఉద్యమ నాయకుల్లో ఒకరైన సుభాష్ చంద్రబోస్ అందరికీ ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో రవి ముదిరాజ్, పాలకుర్తి సదానంద గౌడ్, గోమారం సుదర్శన్ రెడ్డి, వినోద్ గౌడ్, సురేష్, సందీప్ యువకులు తదితరులు.



## వసంత పంచమి వేడుకలు

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం డోకుర్ సమీపంలోని తపోవన్ ప్రైవేటు ఉన్నత పాఠశాలలో శుక్రవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ వర్కుటి నిరంజన్ రెడ్డి లతోపాటు ఉపాధ్యాయులు చంద్రయ్య, నర్సింలు, రవి, శ్రీనివాసులు, ఎక్బాల్బాల్ పాష, తిరుపతయ్య, కురుమూర్తి, నాగరాజు, అనురాధ, ఉమా, సబిహా, పావని, అనిత, భవాని, స్వప్న, శిరీష, కరిష్మా, మౌనిక, లత, గౌతమి, భార్గవి లతోపాటు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పుట్టపల్లిలో ఘనంగా వసంత పంచమి వేడుకలు

- అమ్మవారికి పంచామృత సహిత సుగంధ ద్రవ్యాలతో అభిషేకం
- మఠం సురేష్ స్వామి ఆధ్వర్యంలో పూజలు



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని దేవరకద్ర మండలం పుట్టపల్లి లో శుక్రవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మఠం సురేష్‌స్వామి ఆధ్వరంలో ఈ పూజా కార్యక్రమాలను శాస్త్రక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేషంగా పంచామృత సహిత సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులంతా ఎల్లవేళలా సంపూర్ణ, ఆయుష్షు, ఆరోగ్యాలను ప్రసాదించి గ్రామాన్ని సుభిక్షంగా కాపాడాలని గ్రామ ప్రజలు సంకల్పం మేరకు ఈ పూజా కార్యక్రమాన్ని సాంప్రదాయరీతి లో నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజల ఆశీర్వాదమే నాకు శిరోధార్యం

- వార్డు అభివృద్ధి కోసమే పోటీ
- ప్రజలు ఆశీర్వదించి అభివృద్ధిలో భాగస్వాములు కండి
- షాద్ నగర్ 22వ వార్డు కౌన్సిలర్ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నల్లమోని బిక్షపతి ముదిరాజ్



జయభేరి, షాద్ నగర్, జనవరి 23 :

షాద్ నగర్ మున్సిపల్ ఎన్నికల్లో 22 వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ అభ్యర్థిగా నల్లమోని బిక్షపతి ముదిరాజ్ కోడలు (నల్లమోని రాధిక ముదిరాజ్ )పోటీ చేయనున్నట్లు తెలిపారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ప్రజల ఆశీర్వాదమే నాకు శిరోధార్యం అని ప్రజలు తనకు అవకాశం ఇస్తే వార్డు రూపురేఖలు మార్చుతానని అన్నారు.తన పోటీ కేవలం ప్రజల సంక్షేమం కోసమేనని ఒక్క అవకాశం ఇవ్వండి వార్డు అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తా అన్నారు. పోటీ చేసే అభ్యర్థులను అన్ని విధాలుగా గమనించి మాయమాటలు చెప్పే ఆశావాదులను నమ్మవద్దని అన్నారు. పది మందికి మంచి చేసే గుణగణాలతో వార్డు ప్రజల సంక్షేమ అభివృద్ధి కోసం ఎన్నో ఏళ్లు 22వ వార్డు ప్రజల సమస్యలు తెలిసిన వ్యక్తిగా తనకు పూర్తి అనుభవం ఉందని ప్రజలంతా ఏకమై స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్న నా కోడలు నల్లమోనీ రాధిక ముదిరాజ్ ను అత్యధిక మెజార్టీతో ఆశీర్వదించి గెలిపించాలని ఆయన వార్డు ప్రజలను కోరారు.

**ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తా**

ప్రజలు తమకు అవకాశం ఇచ్చి 22వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా గెలిపిస్తే అన్ని రంగాలలో వార్డు అభివృద్ధి చేస్తానని బిక్షపతి ముదిరాజ్ అన్నారు.

అవకాశం వచ్చినందున తమ బరిలోకి దిగామని కేవలం ప్రజాసేవ కోసమే మా పోరాటమని వార్డులో ఉన్న సమస్యల పట్ల తమకు పూర్తి అవగాహన ఉందని ప్రజలు రాధిక ముదిరాజ్ ను గెలిపిస్తే వార్డుని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## నాయుడుపాలెంలో పశు ఆరోగ్య శిబిరం




జయభేరి, పరవాడ:

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ,ఆంధ్ర ప్రదేశ్ పశు గణాభివృద్ధి సంస్థ రాష్ట్రీయ గోకుల్ మిషన్ మరియు సింహాద్రి ఎన్టీపిసి వారి సౌజన్యంతో చేపట్టిన పశు ఆరోగ్య శిబిరం మరియు పశు ఆరోగ్యం గర్భకోశ నివారణా శిబిరంలో భాగంగా శుక్రవారం పరవాడ మండలం వాడచీపురుపల్లి పశువైద్య శాల పరిధిలోని నాయుడుపాలెం గ్రామంలో వాడ చీపురుపల్లి పశువైద్యులు డా.సురేష్ కుమార్ పోతిరెడ్డి ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు.ఈ పశు ఆరోగ్య శిబిరాన్ని పరవాడ పశు సంవర్ధక శాఖ సబ్ డివిజనల్ అసిస్టెంట్ డైరక్టర్ డాక్టర్ రామకృష్ణ కీర్తి ప్రారంభించి అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమానికి అనకాపల్లి జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా.బి. రామమోహన రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.రైతులు, పశుపోషకుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సింహాద్రి ఎన్టీపిసి సిఎస్ ఆర్ నిధులతో పశు ఆరోగ్య శిబిరం,ఆంధ్ర ప్రదేశ్ పశు గణాభివృద్ధి సంస్థ రాష్ట్రీయ గోకుల్ మిషన్ వారి సౌజన్యంతో గర్భకోశ వ్యాధుల నివారణ శిబిరం నిర్వహించారు.ఈ పశు ఆరోగ్య శిబిరాలలో పశువులకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు పశువులు సకాలంలో ఎదకు రాని పశువులకు వైద్యం అందిస్తారని డా.రామకృష్ణ కీర్తి తెలిపారు.అకాల మరణంతో జరిగే ఆర్థిక నష్టాన్ని నివారించేందుకు అత్యధిక సబ్సిడీతో పశు బీమా పథకాన్ని అమలు చేసేందుకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది అని డా.బి. రామమోహన రావు పశు పోషకులకు ఈ పథకం గురించి సంపూర్ణంగా వివరించారు.ఈ ఉచిత ఆరోగ్య శిబిరంలో 75 పశువులకు వైద్యం,25 పాడి పశువులకు చూడి నిర్ధారణ తనిఖీలు,గర్భకోశ వ్యాధులకు వైద్యం మరియు 50 లేగదూడలకు,గొర్రెలు,మేకలు, పశువులకు నట్టల నివారణ మందులు అందించి తాగించారు.ఈ శిబిరంలో సుమారు 463 పాడి పశువులకు వైద్య సేవలు అందించారు,సుమారు 124 పశు పోషకులు లబ్ధి పొందారని డా.సురేష్ కుమార్ పోతిరెడ్డి తెలిపారు.ఎన్టీపీసీ సి ఎస్ ఆర్ నిధుల ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన వాడ చీపురుపల్లి పశు వైద్యులు డా.సురేష్ కుమార్ పోతిరెడ్డి ని ఈ సందర్భంగా డా. రామ కృష్ణ కీర్తి, పాడి రైతులు అభినందించారు.

## ఎల్లమ్మ ఆలయం పునః నిర్మాణ పనులను శంకుస్థాపన



జయభేరి, శామీర్ పేట్ :

ఆలయాల పునర్ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కోరారు. ఆలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలో పర్యటించిన ఎమ్మెల్యే ఎల్లమ్మ ఆలయ పునర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఆలయాలు నిర్మించడం వలన ఆధ్యాత్మిక పొందుతుందని అన్నారు. అదేవిధంగా ఆలయాల పునర్ నిర్మాణంలో తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. అదేవిధంగా గ్రామాల అభివృద్ధి తోనే ప్రగతి సాధ్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అనిత లాలయ్య, బి ఆర్ ఎస్ సీనియర్ వంగ వెంకట్ రెడ్డి, మాజీ వార్డ్ నెంబర్లు వెంకటేష్ యాదవ్, మల్లేష్ యాదవ్, మాజీ ఉప సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సగ్గు శ్రీనివాస్ యాదవ్ మధుకర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ గుర్క కుమార్ యాదవ్, గ్రామస్తులు,స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పెట్టుబడుల వేటలో రేవంత్



జయభేరి, హైదరాబాద్, జనవరి 23 :

ఏ రాష్ట్రానికి అయినా సరే పెట్టుబడులు చాలా అవసరం. ఎందుకంటే పెట్టుబడుల ద్వారానే ఆదాయం సమకూరుతూ ఉంటుంది. ఉద్యోగాలను కల్పించే అవకాశం ఉంటుంది. ఆర్థికంగా రాష్ట్రాన్ని బలోపేతం చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఈ పెట్టుబడుల కోసమే ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులతో కలిసి దావోస్ వెళ్లిపోయారు...దావోస్ ప్రాంతంలో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ఆయన పాల్గొంటున్నారు. తెలంగాణలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్కిల్ డెవెలప్మెంట్, స్పోర్ట్స్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

తెలంగాణ అభివృద్ధి లక్ష్యాలతో మూడు జోన్ల నమూనాలను దావోస్ వేదికపై ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు విశ్లేషించారు. క్యూర్, ప్యూర్, రేర్ ఆర్థిక అభివృద్ధి వ్యూహంతో పాటు భారత్ ఫ్యూచర్ సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సిటీ నెట్‌జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టుగా, దేశంలో సుస్థిర అభివృద్ధికి రోల్ మోడల్ సిటీగా నిలుస్తుందని శ్రీధర్ బాబు అభిప్రాయం వ్యక్తంచేశారు.

తెలంగాణ సమగ్రాభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక అద్భుత ఫలితాలను ఇస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఏరోస్పేస్, డిఫెన్స్, బయోడిజైన్, సాఫ్ట్‌వేర్, ఫార్మా రంగాల్లో హైదరాబాద్ పరిపూర్ణ అనుకూలతలున్నాయని వివరించారు. కాలుష్యాన్ని తగ్గించే విధంగా ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనంపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి పెట్టిందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి దావోస్ వేదికపై పారిశ్రామిక వేత్తలకు తెలిపారు. తెలంగాణ రైజింగ్ పేరుతో ఆయన పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో 23 వేల కోట్ల పెట్టుబడిలను పెట్టేందుకు అనేక సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందాలను కుదుర్చుకుంది.

డక్టైల్ ఐరన్ పైపుల తయారీలో ప్రపంచ వ్యాప్తంగా పేరున్న రష్మీ గ్రూపు తెలంగాణ రాష్ట్రంలో 12,500 కోట్ల పెట్టుబడితో స్టీలు ఉత్పత్తి యూనిట్ ఏర్పాటు చేయనుంది. స్లోవేకియ దేశానికి చెందిన న్యూక్లర్ ప్రొడక్ట్ సంస్థ 6000 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. స్మాల్ మాడ్యూల్ రియాక్టర్ ఆధారిత విద్యుత్ ప్రాజెక్టు ను తెలంగాణలో ఏర్పాటు చేయబోతోంది.సౌందర్య ఉత్పత్తుల తయారీలో పేరు ఎన్నికల లోరియల్ అనే సంస్థ 3500 కోట్ల పెట్టుబడితో గ్లోబల్ టెక్ హబ్ ను తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేయబోతోంది. అమెరికాలో విమానయాన రంగంలో పేరుపొందిన సర్గార్డ్ అనే సంస్థ.. దశలవారీగా 1 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చింది..

ఇందులో భాగంగా అనేక సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకోనుంది. రష్మీ గ్రూప్ ద్వారా తెలంగాణ రాష్ట్రంలో 12,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు వస్తాయని తెలుస్తోంది.ప్రపంచవ్యాప్తంగా బీర్లను తయారు చేసే అతిపెద్ద కంపెనీగా పేరు తెచ్చుకున్న ఏబి ఇన్ బెవ్.. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న తన తయారీ యూనిట్ ను మరింత విస్తరించబోతోంది. దీనికోసం భారీగా పెట్టుబడులు పెట్టబోతోంది. తద్వారా వేలాది మందికి ఉపాధి లభించబోతోంది. బ్లైజ్ అనే సంస్థ వ్యవస్థాపకుడు దినకర్ మునగాల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇప్పటికే తమ సంస్థ ఆధ్వర్యంలో రీసెర్చ్ డెవలప్మెంట్ సెంటర్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.. త్వరలోనే హెల్త్ కేర్ డయాగ్నస్టిక్స్, మ్యానుఫ్యాక్చరింగ్, ఆటోమేషన్, ఎనర్జీ ఎఫిషియన్సీ వంటి రంగాలలో పెట్టుబడులు పెడతామని దినకర్ వెల్లడించారు. గత ఏడాది జరిగిన సదస్సులో రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ ప్రభుత్వం భారీగా పెట్టుబడులను ఆకర్షించింది. ఈసారి కూడా అదే స్థాయిలో పెట్టుబడులను ఆకర్షిస్తున్నది.

# మేడారంలో తొలి ఘట్టం.. మండమెలిగే..



జయభేరి, వరంగల్ , జనవరి 23 :

మేడారం మహాజాతరకు సరిగ్గా వారం రోజుల ముందు నిర్వహించే తొలిఘట్టం మండమెలిగే పండుగ మహా వైభవంగా జరిగింది. ఆదివాసీ సాంప్రదాయాల ప్రకారం ఆ కార్యక్రమం నిర్వహించారు. దృష్టశక్తుల చూపు మేడారం వైపు పడకుండా దిగ్బంధం చేసి కోడిపిల్లను బలిచ్చి ఊరుకట్టు నిర్వహించారు. మాఘశుద్ధ పంచమి సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకతో మేడారం జాతర ప్రారంభమైనట్టే భావిస్తారు. మండమెలిగే పండుగ నుంచి సరిగ్గా వారం రోజులకు అమ్మవార్లు వనం నుండి జనంలోకి వస్తారు.మేడారం సమ్మక్క సారలమ్మ మహాజాతర సమీపిస్తోంది. జనవరి 28 నుండి 31వ తేదీ వరకు మాఘశుద్ధ పున్నమి వెన్నెల్లో సమ్మక్క సారక్క దేవతల గద్దెలపై కొలువు దీరే గడియలు ఆసన్నం అవుతున్నాయి. మహా జాతరకు సరిగ్గా వారం రోజుల ముందు ఆదివాసీలు ఆచార సాంప్రదాయాల ప్రకారం నిర్వహించే మండమెలిగే పండుగ ముగిసింది. ఈ సందర్భంగా సమ్మక్క సారక్క పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. మేడారంలో సమ్మక్క తల్లి, కన్నెపల్లిలో సారలమ్మ. పూనుగొండ్లలో పగిడిద్దరాజు, కొండాయిలో గోవిందరాజు ఆలయాల్లో ఆదివాసీలు పూజలు నిర్వహించారు. మండమెలిగే వేడుకలో ఆదివాసీ ఆచార సాంప్రదాయాల ప్రకారం మేడారం పొలిమేరల్లో పూజారులు దిష్టి తోరణాలు కట్టారు. కోడిపిల్లను బలిచ్చి ఊరు చుట్టూ తోరణాలు కట్టడం వల్ల ఎలాంటి దుష్టశక్తులు దరి చేరవని ఇక్కడి పూజారుల విశ్వాసం.మేడారం పొలిమేరల్లో మామిడి, తునికి ఆకులతో తోరణాలు కట్టారు. ఊరు చుట్టూ చలిగంజి, అంబలితో కట్టు పోస్తారు. ఆ తరువాత సమ్మక్క సారలమ్మకు సంబంధించిన పూజా సామగ్రిని మేడారం గద్దెలపైకితీసుకొచ్చి పూజలు నిర్వహిస్తారు. పసుపు, కుంకుమలతో పూజలు చలపయ్య మొక్కులు సమర్పిస్తారు. ఆ తరువాత పూజారులంతా. అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి, పూజా కార్యక్రమాలు చేసి కొత్త వస్త్రాలతో గద్దెలను అలంకరిస్తారు. ఈ తంతు నిర్వహించడం ద్వారా జాతరకు అంకురార్పణ జరిగినట్లు బావిస్తారు. పూజలు పూర్తయిన తర్వాత జాగారాలు కూడా చేపడుతారు. ఈ సందర్భంగా ఇవ్వాల రాత్రి నుండి రేపు తెల్లవారుజాము వరకు అమ్మవారి గద్దెల వద్దకు భక్తులు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటారు.మండెమెలిగే పండుగతో జాతర ప్రారంభమైనట్టేనని భావిస్తారు. పుట్టమట్టితో అలికి ముగ్గులు కూడా వేశారు. సమ్మక్క సారలమ్మ ఆయుధాలు, గజ్జెలు, కత్తులు, కుంకుమ భరిణెలు, ఇతర పూజా సామగ్రిని శుద్ధి చేస్తారు. అనంతరం మేడారం లోని సమ్మక్క ప్రధాన పూజారి ఇంటి నుంచి డప్పుచప్పుళ్లు, డోలు వాయిద్యాల నడుమ పసుపు, కుంకుమలతో మేడారం చుట్టూ ఊరేగింపు నిర్వహించారు.. అక్కడి నుంచి సమ్మక్క గుడికి వెళ్లి గిరిజన ఆడపడుచులు పూజలు చేస్తారు. ఆ తరువాత గ్రామ బొడ్రాయికి శుద్ధ జలంతో అభిషేకాలు చేశారు.

# 10 కి.మీ ప్రయాణానికి 45 నిమిషాలు

- ప్రపంచంలోనే అత్యధిక ట్రాఫిక్ కలిగిన రెండో నగరం ఇదే!



జయభేరి, హైదరాబాద్, జనవరి 23 :

ఇప్పటికే ట్రాఫిక్‌కు అపఖ్యాతి పాలైన భారతదేశ టెక్ రాజధాని బెంగళూరు ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే నగరాల్లో ఒకటిగా అవతరించింది. తాజాగా నెదర్లాండ్‌కు చెందిన టామ్ టామ్ ట్రాఫిక్ ఇండెక్స్ విడుదల చేసిన రిపోర్ట్ ప్రకారం.. మెక్సికో సిటీ 75.9 శాతం ట్రాఫిక్ రద్దీతో ఈ జాబితాలో మొదటి స్థానంలో నిలవగా బెంగళూరు 74.4 శాతం ట్రాఫిక్ రద్దీతో ప్రపంచవ్యాప్తంగా అత్యంత ట్రాఫిక్ రద్దీ కలిగిన రెండవ నగరంగా నిలిచిందని పేర్కొంది. అయితే 2014తో పోలిస్తే 2025లో బెంగళూరు నగరంలో ట్రాఫిక్ రద్దీ 1.7 శాతం పెరిగినట్లు పేర్కొంది.

దీన్ని బట్టి చూస్తే బెంగళూరులోని జనాలు ఎక్కువ సమయం రోడ్లపైనే గడుపుతున్నారని అర్థమవుతుంది.బెంగళూరు ప్రయాణికులకు, నివేదికలోని ముఖ్య గణాంకాలను బట్టి చూస్తే.. 2024లో నగరంలో ట్రాఫిక్ రద్దీ సమయంలో 10 కి.మీ దూరం ప్రయాణించడానికి అరగంట సమయం పడితే 2025కు వచ్చేసరికి 10 కి.మీ ప్రయాణించేందుకు సగటున 36 నిమిషాల 9 సెకన్లు పట్టింది. బెంగళూరులో ఉదయం వేళల్లో ట్రాఫిక్ రద్దీ శాతం 94 శాతంగా ఉంటే అప్పుడు 10 కి.మీ ప్రాణించేందుకు 41 నిమిషాల 6 సెకన్లు పడుతదుంది. అప్పుడు వాహనం సగటు వేగం గంటలకు కవలం 14.6 కి.మీ మాత్రమే ఉంది. ఇక సాయంత్రం సమయాల్లో 115.2 శాతం రద్దీ ఉంటే.. అప్పుడు 10 కి.మీ ప్రయాణిచేందుకు 45 నిమిషాల 27 సెకన్లు పడుతుంది. అప్పుడు వాహనం సగటు వేగం గంటలకు 13.2 కి.మీగా ఉంది. అంటే 15 నిమిషాల్లో కేవలం 4 కిలో మీటర్లు మాత్రమే ప్రయాణిస్తున్నారు. 2025లో రద్దీ సమయాల్లో ట్రాఫిక్ కారణంగా బెంగళూరు డ్రైవర్లు 168 గంటలు కోల్పోతారని ఇండెక్స్ అంచనా వేసింది, ఇది 7 రోజుల 40 నిమిషాలకు సమానం అని తెలిపింది. 2024తో పోల్చుకుంటే ఇది 12 గంటల 46 నిమిషాలు ఎక్కువ. బెంగళూరులో అత్యధికంగా ట్రాఫిక్ రద్దీ కలిగిన మే 17,2025ను అత్యంత చెత్త రోజుగా టామ్‌టామ్ పేర్కొంది.ఇక హైదరాబాద్ విషయానికి వస్తే నగరంలో సగటున 55.5 శాతం ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. ఈ సమయంలో 18 కిలో మీటర్లు ప్రయాణించేందుకు గంట సమయం పడుతుంది. ఈ ట్రాఫిక్ రద్దీ కారణంగా సుమారు నగర వాసులకు 123 గంటల సమయం వృదా అవుతుంది.

### అత్యంత ట్రాఫిక్ కలిగిన 35 నగరాల్లో 7 ఇండియావే

2 బెంగళూరు - 74.4 శాతం రద్దీ, 5 పూణే - 71.1 శాతం, 18 ముంబై - 63.2 శాతం, 23 న్యూఢిల్లీ - 60.2 శాతం, 29 కోల్‌కతా - 58.9 శాతం, 30 జైపూర్ - 58.7 శాతం, 32 చెన్నై - 58.6 శాతం.




# నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు

జయభేరి, కొండమల్లేపల్లి :

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కొండమల్లేపల్లి శాఖ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 129వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కొండమల్లేపల్లి నగర కార్యదర్శి పర్వతం దినేష్ మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ చెప్పినట్లుగా నాకు రక్తం ఇవ్వండి మీకు స్వాతంత్ర్యం ఇస్తాను.అనే మాటలు కేవలం నినాదాలు కాదు అవి త్యాగానికి, దేశభక్తికి ప్రతీక అని వారన్నారు.నేటి భారత యువత వారిని ఆదర్శంగా తీసుకొని. జాతీయ పునర్నిర్మానంలో భాగ్యస్వామ్యం కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నగర బాలికల కన్వీనర్ సుస్మిత నగర సంయుక్త కార్యదర్శి కుమార్, హేమంత్,చరణ్,చిరు తదితరులు పాల్గొన్నారు.

# నేడు చంద్రన్న 21వ వర్ధంతి

జయభేరి, దేవరకొండ :

దివంగత కార్మిక నాయకుడు, ప్రజల మనిషి దేవరకొండ మాజీ సర్పంచ్ స్వర్గీయ డ్రైవర్ చంద్రన్న 21 వ వర్ధంతి కార్యక్రమాన్ని దేవరకొండ పట్టణ నడి బొడ్డున కల చంద్రన్న కాంస్య విగ్రహం వద్ద ఘన నివాళులు అర్పించిన అనంతరం స్థానిక కోదండ రామాలయం లో అన్న దాన కార్యక్రమం , ఈ సంవత్సరం నుండి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన చంద్రన్న గోల్డ్ మెడల్ రూ,, 50000/ దేవరకొండ మండలం లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లో విద్యానభ్యసించి పదవ తరగతి లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి సన్మానం, చంద్రన్న గోల్డ్ మెడల్ బహుకరించడం జరుగుతుంది కావున చంద్రన్న అభిమానులు, శ్రేయోభిలాషులు, మిత్రులు అందరు పాల్గొనవలసినదిగా చంద్రన్న కుమారులు హన్మంతు వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రాఘవేంద్ర గౌడ్ ఒక ప్రకటన లో తెలియజేయడం జరిగింది.

# జనవరి 28 న ఫార్మసిస్ట్ పోస్టులకు జాబ్‌మేళా

- 100 ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీ

జయభేరి, హైదరాబాద్, జనవరి 23 :

ఉస్మానియా యూనివర్సిటీ లోని ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో అపోలో ఫార్మసీ ఆధ్వర్యంలో ఈ నెల 28 న ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నది ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నారు. అపోలో ఫార్మసీ లోని ఫార్మాసిస్టు, అసిస్టెంట్ ఫార్మసిస్ట్ లకు చెందిన 100 పోస్టులను ఈ జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు డీ ఫారసీ, బీ ఫార్మసీ ఎం.ఫార్మసీ, ఏదైనీ డిగ్రీ చేసిన 18 నుండి 35 సంవత్సరాల వయసు వారికి మాత్రమే ఈ జాబ్ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డిప్యూటీ చీఫ్(UEI &GB/MCC)ఒక ప్రకటనలో తెలియజేసింది. రూ.12,000 నుండి రూ.25,000 వేలవరకు వేతనం ఉండే ఈ ఫార్మసిస్ట్ ఉద్యోగాలకు మరిన్ని వివరాలకు. T రఘుపతి, HR (Ph.No.8247656356) ను సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు విద్యార్థతల సర్టిఫికెట్ల జిరాక్స్ తో ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో, వద్ద నేరుగా జనవరి 28,2026న హాజరు కావాలని పేర్కొన్నారు.



# అక్కులమ్మ పేరంటాలు తీర్థ మహోత్సవంలో ఎమ్మెల్యే బండారు

జయభేరి, పరవాడ;

అనకాపల్లి జిల్లా పరవాడ మండల కేంద్రమైన.అక్కులమ్మ పేరంటాలు తీర్థ మహోత్సవం సందర్భంగా మాడుగుల నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజల సంక్షేమం, శాంతి సౌభాగ్యాల కోసం ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ఎమ్మెల్యే తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ తీర్థ మహోత్సవానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి దర్శనంతో పుణ్యఫలం పొందారు. స్థానిక ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ముమ్మరంగా మన్యంకొండ బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన దేవాలయమైన మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం పలు ఏర్పాటు చేశారు. గత కొన్ని రోజులుగా దేవస్థానం వద్ద బ్రహ్మోత్సవాలను దృష్టిలో పెట్టుకొని ముమ్మరంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏడాది స్వామివారి బ్రహ్మోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈనెల 28న స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా దేవాలయం వద్ద భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భక్తుల రాక సందర్భంగా దిగువకొండ వద్ద పలు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, వంశ పారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, పర్యవేక్షకుడు నిత్యానంద చారి లతో పాటు దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వసంత పంచమి, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు



జయభేరి, చందంపేట :

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చందంపేట యందు సరస్వతీ మాత పటానికి మరియు నేతాజీ సుభాష్ చంద్రబోస్ పటానికి పూలమాలలు వేసి ఈ సందర్భముగా పాఠశాల గజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి లీలారాణి మాట్లాడుతూ మాగ శుద్ధ పంచమి సరస్వతి జయంతి గా ఈ రోజునే వసంత పంచమి శ్రీ పంచమి అని ఈరోజు సరస్వతీ మాత ఆవిర్భావ దినోత్సవం గా విద్యార్థులు పెద్దవారు పూజిస్తారని బుద్ధి జ్ఞానముల స్వరూపము సరస్వతి మాత అని ఈ రోజున చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తారని, అదేవిధంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఈరోజు అని జయంతి మాత్రమే ఉండి వర్ధంతి లేని వ్యక్తి అని ఆజాద్ హిందూ ఫౌజ్ సైన్యాన్ని తయారుచేసి బ్రిటిష్ వారిపై దండెత్తిన పరాక్రమవంతుడని ఈ రోజును పరాక్రమ దినోత్సవ పిలుచుకుంటామని కొనియాడారు. ఈ సందర్భముగా విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేసినారు తదుపరి విద్యార్థులకు మిఠాయిలు పంచడం జరిగింది. ఈ కార్యక్రమములో ఎం చంద్రశేఖర్, గోవిందు కొండయ్య, జోసెఫ్ చౌదరి, రామచంద్రు, విజయ, మధు, డాక్టర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన కార్యక్రమం




జయభేరి, పరవాడ:

పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో కొత్త క్రిమినల్ చట్టాలు పై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో, ఎస్ఐ బి .కృష్ణ రావు ఆధ్వర్యంలో పరవాడలో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భారతీయ న్యాయ సంహిత,భారతీయ న్యాయ ప్రక్రియ సంహిత,భారతీయ సాక్ష్య సంహితల్లో తీసుకువచ్చిన ముఖ్యమైన మార్పులు, ప్రజల హక్కులు, బాధ్యతలు, పోలీస్ వ్యవస్థలో జరిగిన సంస్కరణలు, ఫిర్యాదుల నమోదు విధానం, బాధితులకు కల్పిస్తున్న కొత్త రక్షణ చర్యల గురించి సరళంగా వివరించారు.అలాగే, మహిళలు, పిల్లలు, వృద్ధులు, బలహీన వర్గాల రక్షణకు సంబంధించిన నూతన నిబంధనలు, సాంకేతికత ఆధారిత విచారణ విధానం, త్వరిత న్యాయ ప్రక్రియ లక్ష్యాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పోలీసులతో ప్రజలు నేరుగా చర్చించి తమ సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం కల్పించబడింది. ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకొని, పోలీస్ శాఖకు సహకరించాలని పరవాడ పోలీసులు కోరారు.



# చిరంజీవి–బాబీ కొల్లి కాంబోపై అంచనాలు కృతి శెట్టి పాత్రపై తొలగిన అనుమానాలు

మెగాస్టార్ చిరంజీవి తాజాగా 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రంతో బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకుని మళ్లీ ఫుల్ ఫామ్‌లోకి వచ్చారు. ఈ సెన్సేషనల్ హిట్‌తో ఆయన మార్కెట్ మరింత బలపడగా, తదుపరి ప్రాజెక్టులపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా చిరంజీవి కెరీర్‌లో 158వ చిత్రంగా తెరకెక్కబోయే సినిమా ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.ఈ చిత్రానికి యువ దర్శకుడు బాబీ కొల్లి దర్శకత్వం వహించనున్న విషయం ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. మాస్ యాక్షన్ ఎలిమెంట్స్‌ను ఎమోషనల్ డ్రామాతో మిళితం చేయడంలో బాబీకి ఉన్న అనుభవం కారణంగా, ఈ కాంబినేషన్‌పై ఇండస్ట్రీలో మంచి బజ్ ఏర్పడింది. అయితే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఇటీవల సోషల్ మీడియాలో కొన్ని ఆసక్తికర రూమర్స్ వైరల్ అయ్యాయి. యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ కృతి శెట్టి ఈ సినిమాలో చిరంజీవి కూతురు పాత్రలో నటించనుందన్న వార్తలు హల్‌చల్ చేశాయి. 'బేబమ్మ'గా గుర్తింపు తెచ్చుకున్న కృతి శెట్టిని మెగాస్టార్ సినిమాలో కీలక పాత్రలో చూడబోతున్నామని అభిమానులు భావించారు. కానీ తాజాగా ఈ రూమర్స్‌పై ఫుల్ క్లారిటీ వచ్చేసింది. పరిశ్రమ వర్గాల సమాచారం ప్రకారం, ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టమైంది. కృతి శెట్టి ఈ ప్రాజెక్ట్‌లో భాగం కాదని, ఆమె చిరంజీవి కూతురి పాత్రలో నటిస్తుందన్న ప్రచారం కేవలం గాసిప్ మాత్రమేనని తెలుస్తోంది. ప్రస్తుతం హీరోయిన్ ఎంపికపై మేకర్స్ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఇక సినిమాకి సంబంధించి ఇతర వివరాలు చూస్తే, బాబీ కొల్లి ఈ చిత్రాన్ని పూర్తిగా సాలిడ్ యాక్షన్ డ్రామాగా రూపొందించనున్నట్లు సమాచారం. చిరంజీవిని మాస్ అవతార్‌లో, పవర్‌ఫుల్ పాత్రలో చూపించేందుకు స్క్రిప్ట్‌ను డిజైన్ చేసినట్లు టాక్. అభిమానులు కోరుకుంటున్న వింటేజ్ మెగాస్టార్ ఎలివేషన్స్, యాక్షన్ సీక్వెన్సులు ఈ సినిమాలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయట. ఈ చిత్రాన్ని కన్నడకు చెందిన ప్రముఖ నిర్మాణ సంస్థ కే వి ఎన్ ప్రొడక్షన్స్ నిర్మించనుంది. భారీ బడ్జెట్‌తో, అత్యున్నత సాంకేతిక విలువలతో ఈ ప్రాజెక్ట్‌ను తెరకెక్కించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని సమాచారం. త్వరలోనే షూటింగ్ షెడ్యూల్, నటీనటుల వివరాలపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది.మొత్తంగా చూస్తే, చిరంజీవి-బాబీ కొల్లి కాంబినేషన్‌పై అంచనాలు రోజురోజుకు పెరుగుతుండగా, కృతి శెట్టి పేరుతో వచ్చిన రూమర్స్‌కు మాత్రం ఫుల్ స్టాప్ పడింది.

# 'మహాభారతం'తో దేశం గర్వించాలి



భారతీయ పురాణేతిహాసం 'మహాభారతం' తన డ్రీమ్ ప్రాజెక్ట్ అని బాలీవుడ్ అగ్ర నటుడు అమీర్‌ఖాన్ అనేక సందర్భాల్లో వెల్లడించారు. ఈ ఏడాదిలోనే ఈ సినిమా తాలూకు ప్రకటన ఉంటుందని అన్నారు. తాజా ఇంటర్వ్యూలో 'మహాభారత' ప్రాజెక్ట్ గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు అమీర్‌ఖాన్. మహాభారతం అనేక తరాలుగా భారతీయుల సంస్కృతిలో మమేకమైపోయిందని, భావోద్వేగాలపరంగా అదొక మహోన్నతమైన కావ్యమని అమీర్‌ఖాన్ కొనియాడారు. అందుకే ఈ ప్రాజెక్ట్‌పై ఆచితూచి అడుగులు వేస్తున్నానని, అన్నీ పక్కాగా కుదిరిన తర్వాతే ముందుకెళ్తానని చెప్పారు. తాజా ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'మహాభారతం' నా చిరకాల స్వప్నం. ఎప్పటికైనా ఆ కలను నెరవేర్చుకుంటా. అదొక గొప్ప బాధ్యత. మహాభారతం భారతీయుల రక్తంలో ఇమిడిపోయింది. భగవద్గీత, మహాభారతం చదవని భారతీయులు ఎక్కడా కనిపించరు. ఏదో ఒకరోజు భారతీయులందరూ గర్వించేలా 'మహాభారతం'ను వెండితెర దృశ్యమానం చేస్తా. హాలీవుడ్‌లో లార్డ్ ఆఫ్ ది రింగ్స్, అవతార్ వంటి భారీ సినిమాలొచ్చాయి. వాటన్నింటికి మహాభారతం అమ్మలాంటిది' అని అన్నారు. గత ఏడాది ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మహాభారతం తన చివరి చిత్రమని, ఈ ప్రాజెక్ట్ కోసం సర్వశక్తులు ధారపోస్తానని అమీర్‌ఖాన్ పేర్కొన్నారు.,

# పెళ్లి అవలేదు..



తాజాగా 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రంతో కెరీర్‌లో తొలి విజయాన్ని అందుకున్నది తెలుగమ్మాయి డింపుల్ హయాతి. త్వరలో మరికొన్ని సినిమాలతో ఈ అందాలభామ సందడి చేయనున్నది. ఇదిలావుంటే.. డింపుల్ హయాతి వివాహిత అని, తన భర్త పేరు డేవిడ్ అని ఆ మధ్య వార్తలు వచ్చాయి. ఈ విషయంపై ఓ అభిమాని అడిగిన ప్రశ్నకు డింపుల్ స్పందిస్తూ, తన పెళ్లి గురించి క్లారిటీ ఇచ్చింది. 'నాకు పెళ్లి అయ్యిందంటూ గతంలో చాలామంది రాశారు. అవన్నీ అబద్ధాలే. నేను అవివాహితను. ఇలాంటి వార్తలు నా కెరీర్‌ని ప్రభావితం చేసే ప్రమాదం ఉంది. అందుకే వివరణ ఇస్తున్నా.' అని చెప్పుకొచ్చింది డింపుల్ హయాతి. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ సమాధానం వైరల్ అవుతున్నది.

# హీరోయినే విలన్.. కట్ చేస్తే..



రుక్మిణి వసంత్.. ఇప్పుడు దేశవ్యాప్తంగా మారుమోగుతున్న పేరు. సప్త సాగరాలు దాటి సినిమాతో కన్నడలో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది ఈ ముద్దుగుమ్మ. ఆ తర్వాత ఆమె పేరు ఎక్కువగా వినిపించింది. దీంతో తెలుగు, తమిళం, కన్నడ భాషలలో వరుస అవకాశాలు క్యూ కట్టాయి. అదే సమయంలో ఆమె కెరీర్ ప్రారంభంలోనే నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించింది. మొదట్లో ఆ పాత్ర పోషించడానికి చాలా భయపడిందట. తన కెరీర్‌ను దెబ్బతీస్తుందని రుక్మిణి టెన్షన్ పడిందట. కానీ అదే సినిమా భారీ విజయాన్ని అందుకోవడమే కాకుండా రుక్మిణి కెరీర్ మలుపు తిప్పింది. ఆ సినిమా పేరు కాంతార చాప్టర్ 1. కన్నడ హీరో రిషబ్ శెట్టి తెరకెక్కించిన ఈ చిత్రం ఊహించని విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సినిమా అవకాశం గురించి రుక్మిణి వసంత్ మాట్లాడుతూ.. "నాకు చాలా కష్టమైన నిర్ణయం. కాంతర లాంటి సినిమాకు ఆఫర్ రావడం చాలా పెద్ద విషయం. రిషబ్ శెట్టి సర్ నన్ను దాని కోసం పిలిచినప్పుడు, నేను చాలా సంతోషించాను. కానీ ఆ సినిమాలో నువ్వే విలన్ అని ఆయన అన్నారు. ఇది విన్నప్పుడు, నేను అయోమయంలో పడ్డాను. ఒకింత ఒత్తిడికి గురయ్యాను. మూస పద్దతి కాకుండా సరికొత్తగా ప్రయత్నించాలని నిర్ణయించుకున్నాను. కొన్ని పాత్రలు చేయవద్దని.. లేదా ఆ రకమైన పాత్రలు వద్దు అని చెబుతుంటారు. ఒక నటిగా నిర్దిష్ట జోన్ లో ఉండాలని వింటుంటాం. ఆ తర్వాత కాంతార సినిమాకు ఒప్పుకున్నాను. సంవత్సరం భయపడలేదు. కానీ విడుదల సమయం దగ్గరపడినప్పుడు భయం కలిగింది. ఈ సినిమా నా భవిష్యత్తుపై ప్రభావం చూపిస్తుందా ? అని టెన్షన్ పడ్డాను. కానీ కాంతార తర్వాత నాకు ప్రశంసలు వచ్చాయి" అంటూ చెప్పుకొచ్చింది.

# తర్వాత బాలకృష్ణతోనేనా?



గత ఏడాది సంక్రాంతికి 'సంక్రాంతికి వస్తున్నాం'తో సందడి చేసిన దర్శకుడు అనిల్ రావిపూడి..మొన్న సంక్రాంతికి 'మన శంకర వరప్రసాద్ గారు'తో రీజనల్ రికార్డులన్నింటినీ తుడిపెట్టేశారు. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ వచ్చే ఏడాది సంక్రాంతిని కూడా ఈ యంగ్ ఎనర్జిటిక్ డైరెక్టర్ టార్గెట్ చేసినట్టు ఫిల్మ్ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నది. మరి వచ్చే ఏడాది సంక్రాంతికి అనిల్ ఏ హీరోతో వస్తారు? అనే వివరాల్లోకెళ్తే.. 'విశ్వంభర' ప్రమోషన్స్ పూర్తి చేసి, శ్రీకాంత్ ఓదెల సెట్లోకి ఎంట్రీ ఇచ్చేందుకు సమాయత్తం అవుతున్నారు మెగాస్టార్ చిరంజీవి. ఆ తర్వాత లైన్లో బాబీ ఎలాగూ ఉన్నాడు. వెంకటేష్ విషయానికొస్తే.. ప్రస్తుతం ఆయన 'ఆదర్శకుటుంబం' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా మే చివర్లో విడుదలయ్యే అవకాశం ఉంది. ఇక వెంకీతో అనిల్ జూన్‌లో షూటింగ్ ప్రారంభించినా సంక్రాంతికి రావడం కష్టం. ప్రభాస్, తారక్, బన్నీ, చరణ్, నానీ వీళ్లంతా ఆల్రెడీ వారివారి ప్రాజెక్టులతో బిజీబిజీ. రెండుమూడేళ్ల పాటు వాళ్ల డైరీలన్నీ నిండిపోయి ఉన్నాయి.

మరి వెంటనే షూటింగ్ అంటే అనిల్‌కి దొరికే హీరో ఎవరు? అంటే ఫిల్మ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్న పేరు 'నందమూరి బాలకృష్ణ'. నిజానికి మలినేని గోపీచంద్ దర్శకత్వంలో బాలయ్య ఓ సినిమా చేయాలి. ప్రారంభోత్సవాన్ని కూడా జరుపుకున్న ఈ సినిమా.. సెట్స్‌కి వెళ్లడానికి కాస్త ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. మరోవైపు అనిల్ రావిపూడి దగ్గర బాలకృష్ణకు సరిపడా కథ సిద్ధంగా ఉంది. అన్నీ అనుకూలిస్తే ఈ సినిమా పట్టాలెక్కే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఫిల్మ్ వర్గాల చెబుతున్నాయి. రెండేళ్ల క్రితం బాలకృష్ణ, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వచ్చిన 'నేలకొండ భగవంత్ కేసరి' సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలవడంతోపాటు, జాతీయ అవార్డును కూడా అందుకున్న విషయం తెలిసిందే.

Printed and Published, Editor & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com